ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -209 పేజీలు - 08 వెల - 04/- మంగళవారం 27 మే 2025

# కడప మహానాడుకు సర్వం సిద్ధం






**జెండా ఆవిష్కరణతో కార్యక్రమం ప్రారంభం**

**తొలిరోజు జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రసంగం**

కడప, మే26 ఆంధ్ర ప్రగతి:
రాయలసీమ జిల్లాల నడిబొడ్డున కడప వేదికగా తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహణకు సర్వం సిద్ధమైంది. మంగళవారం ఉదయం 8.30 గంటలకు ప్రతినిధుల నమోదుతో పసుపు పండగ ప్రారంభమవుతుంది. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్, రక్తదాన శిబిరాలు ప్రారంభించనున్నారు. ఉదయం 10.45 గంటలకు పార్టీ జాతీయ అధ్యక్షులు, పొలిట్‌బ్యూరో సభ్యులు, ఇతర ముఖ్య నాయకులు వేదికపైకి చేరుకుంటారు. చంద్రబాబు పార్టీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేసి, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తారు. అనతరం 'మా తెలుగు తల్లికి' గీతాలాపనతో మహానాడు లాంఛనంగా ప్రారంభమవుతుంది. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమం... కార్యకర్తలకు పెద్దపీట వేయడంతోమిగతాది 2లో...

# జమిలీ సాధ్యమే

**వన్ నేషన్ - వన్ ఎలక్షన్ సదస్సులో పవన్ ఉద్ఘాటన**

- తమిళనాడులో కూటమి తరుపున ఎన్నికల ప్రచారం చేస్తా పవన్ కల్యాణ్
- ఈసారి ఎన్నికలలో అక్కడ బిజెపి కూటమిదే అధికారం
- ప్రతిసారి ఎన్నికలతో ప్రజా ధనం వృధా
- కొత్తగా పార్టీ పెట్టిన హీరో విజయ్ కు అభినందనలు



2లో

## మాజీ మంత్రి కాకాణికి 14 రోజుల రిమాండ్

- అక్రమ మైనింగ్ కేసులో కాకాణికి రిమాండ్
- రిమాండ్ విధించిన వెంకటగిరి కోర్టు
- కాకాణిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



# భారత్‌తో శత్రుత్వమే పాక్ ఏకైక లక్ష్యం

**కొత్త లోకోమోటివ్ ప్లాంట్, రైళ్లను జాతికి అంకితం చేసిన మోదీ**

- పేదరిక నిర్మూలన, వికసిత భారత్ నిర్మాణమే తమ ధ్యేయమని స్పష్టీకరణ
- పహల్గామ్ దాడి తర్వాత 'ఆపరేషన్ సింధూర్' విజయవంతమైందని వెల్లడి
- దహోద్‌లో రూ.24,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభం



2లో

## గోదావరిలో 8 మంది యువకులు గల్లంతు

- చంద్రబాబు, పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి
- శుభకార్యానికి హాజరై స్నానానికి వెళ్లగా ఘటన
- కాకినాడ, రామచంద్రపురం, మండపేటకు చెందినవారిగా గుర్తింపు
- ముమ్మరంగా కొనసాగుతున్న గాలింపు చర్యలు
- జిల్లా కలెక్టర్ తో మాట్లాడిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్



ముమ్మిడివరంమే26 ఆంధ్ర ప్రగతి:
కోనసీమ జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. ముమ్మిడివరం మండలం కమినిలంక వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగిన ఎనిమిది మంది యువకులు గల్లంతయ్యారు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది.
వివరాల్లోకి వెళితే, కె.గంగవరం మండలం శురుల్లంక గ్రామంలో జరిగిన ఒక శుభకార్యానికి పలువురు యువకులు హాజరయ్యారు. వీరిలో 11 మంది సరదాగా స్నానం చేసేందుకు సమీపంలోని కమినిలంక వద్ద గోదావరి నదిలోకి దిగారు. అయితే,మిగతాది 2లో...

## మంత్రివర్గ విస్తరణకు రాహుల్ ఓకే



**త్వరలోనే పిసిసి కార్యవర్గ కూర్పు**

**పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడి**

న్యూఢిల్లీ,మే26 ఆంధ్ర ప్రగతి:
ఒకటెండు రోజుల్లో టీపీసీసీ కార్యవర్గ ప్రకటన ఉంటుందని అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన.. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో భేటీ- అయ్యారు. సతీసమేతంగా రాహుల్‌ని కలిశారు. మిగతాది 2లో...

## కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు



- ఫార్ములా ఈ కేసులో విచారణకు హాజరుకావాలని ఆదేశం
- ఈ నెల 28న విచారణకు రావాలని నోటీసులో వెల్లడి
- ప్రస్తుతం యూకే, అమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్
- తిరిగి వచ్చాక విచారణకు హాజరవుతానని సమాధానం

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నోటీసులు జారీ చేశారు. గతంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ రేసు వ్యవహారానికి సంబంధించిన కేసులో విచారణ నిమిత్తం ఈ నోటీసులు పంపించారు.ఫార్ములా ఈ కేసు దర్యాప్తులో భాగంగా కేటీఆర్‌ను విచారించాలని ఏసీబీ అధికారులు నిర్ణయించారు.మిగతాది 2లో...

## 1000 దాటిన కరోనా కేసులు...

**ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ కీలక సూచనలు**

- దేశంలో మళ్ళీ పెరుగుతున్న కరోనా కేసులు
- కొత్త వేరియంట్లపై భయం వద్దన్న ఐసీఎంఆర్ డీజీ
- క్యాన్సర్ రోగులు, రోగనిరోధక శక్తి తక్కువ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి




2లో

## ఈసారి ముందుగానే నైరుతి

- ఏపీలో ప్రవేశించిన నైరుతి
- రుతుపవనాలు: ఏపీఎస్డీఎంఏ అధికారిక ప్రకటన
- మే 24నే కేరళను తాకిన వైనం
- ఏపీలోనూ ముందుగానే ఎంట్రీ



2లో

# గోదావరిలో ఎనిమిది మంది గల్లంతు...

(మొదటి పేజీ తరువాయి)

వారు దిగిన ప్రాంతంలో నది లోతు ఎక్కువగా ఉండటంతో అదుపుతప్పి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయారు. వారిలో ముగ్గురు అతి కష్టం మీద సురక్షితంగా ఒడ్డుకు చేరుకోగా, మిగిలిన ఎనిమిది మంది ఆచూకీ తెలియలేదు.

గల్లంతైన యువకులను కాకినాడ, రామచంద్రపురం, మండపేట ప్రాంతాలకు చెందిన క్రాంతి, పాల్, సాయి, సతీష్, మహేశ్, రాజేశ్, రోహిత్, మహేశ్‌గా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానిక అధికారులు, గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. గజ ఈతగాళ్ల సాయంతో గల్లంతైన వారి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారు.



**సీఎం, డిప్యూటీ సీఎం దిగ్భ్రాంతి**

ఈ దురదృష్టకర ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విషయం తెలిసిన వెంటనే ఆయన కోనసీమ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గల్లంతైన యువకులను రక్షించేందుకు తక్షణమే అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గాలింపు చర్యల పురోగతిని కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కూడా కోనసీమ జిల్లా కలెక్టర్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన యువకుల ఆచూకీని వీలైనంత త్వరగా కనుగొనేందుకు గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గల్లంతైన యువకుల కుటుంబ సభ్యులు, బంధువులు సంఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వారి ఆవేదన పలువురిని కంటతడి పెట్టించింది. రాత్రి సమయం కావడంతో గాలింపు చర్యలకు కొంత ఆటంకం ఏర్పడినప్పటికీ, అధికారులు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు.

# జమిలీ సాధ్యమే

## వన్ నేషన్ - వన్ ఎలక్షన్ సదస్సులో పవన్

చెన్నైమే26 ఆంధ్ర ప్రగతి:

తమిళనాడులో త్వరలో జరిగే ఎన్నికలలో బిజెపి కూటమి విజయం సాధించడం తధ్యమని అన్నారు ఎపి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ . తమిళనాడు ఎన్నికల్లో అవసరమైతే ప్రచారం చేస్తానని అంటూ ఎన్డీయే కూటమి గెలుపు కోసం పని చేయడానికి తాను ఎన్నడూ సిద్ధమేనని తేల్చి చెప్పారు..

చెన్నైలో తమిళనాడు రాష్ట్ర బీజేపీ ఆధ్వర్యంలో నేడు నిర్వహించిన వన్ నేషన్ %-% వన్ ఎలక్షన్ వర్క్ షాపులో జనసేన సేనాని పాల్గొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ మాజీ గవర్నర్ తమిళసై సౌందరరాజన్, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు నయనార్ నాగేంద్రన్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జాతీయ కన్వీనర్ అనిల్ ఆంథోనీ, బీజేపీ తమిళనాడు నేతలు అర్జున మూర్తి, చక్రవర్తి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, జమిలిపై



స్టాలిన్ తననిర్ణయాన్ని పునరాలోచించాలని కోరారు..తరచూ ఎన్నికల వల్ల కేంద్రంపై భారం పడుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.. సినిమాలువేరు,రాజకీయాలు వేరు అని అంటూ కొత్త పార్టీ పెట్టిన హీరో విజయ్‌కు శుభాకాంక్షతెలిపారు.. ఇక ఈవీఎంలపై వైసీపీకి ఓ విధానం లేదని పవన్ కల్యాణ్ మండిపడ్డారు.. 2019లో వైసీపీ గెలిచింది కూడా ఈవీఎంలతోనే అని గుర్తు చేశారు. సనాతన ధర్మంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని




ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశమే సనాతన ధర్మ భూమి అని అంటూ మన దేశంలో రామాలయం లేని ఊరు లేదని చెప్పారు.

# భారత్‌తో శత్రుత్వమే పాక్ ఏకైక లక్ష్యం

న్యూఢిల్లీ,మే26 ఆంధ్ర ప్రగతి:

దేశ విభజన సమయం నుంచి పాకిస్థాన్ ఏకైక లక్ష్యం భారత్‌తో శత్రుత్వమేనని, అయితే భారతదేశం మాత్రం పేదరిక నిర్మూలన, దేశాభివృద్ధికే ప్రాధాన్యత ఇస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గుజరాత్‌లోని దహోద్‌లో సోమవారం జరిగిన ఓ సభలో ఆయన మాట్లాడుతూ, పహల్గామ్ దాడి అనంతరం భారత సాయుధ బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయాన్ని గుర్తుచేస్తూ ఉగ్రవాదంపై తమ ప్రభుత్వ కఠిన వైఖరిని మరోసారి నొక్కిచెప్పారు. ఇదే పర్యటనలో భాగంగా రూ.24,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

"విభజన తర్వాత, కొత్తగా ఏర్పడిన దేశానికి (పాకిస్థాన్) ఒకే ఒక లక్ష్యం ఉంది... భారతదేశాన్ని ద్వేషించడం, మన పురోగతిని ఆపడానికి ప్రయత్నించడం. కానీ మనకు ఒకే ఒక లక్ష్యం ఉంది... ముందుకు సాగడం, పేదరికాన్ని నిర్మూలించడం, వికసిత భారత్‌ను నిర్మించడం" అని ప్రధాని మోదీ అన్నారు. "మన సాయుధ బలగాలు



బలంగా ఉన్నప్పుడే నిజమైన అభివృద్ధి చెందిన భారతదేశం సాధ్యమవుతుంది. ఆర్థిక వ్యవస్థ కూడా పటిష్టంగా ఉండాలి. ఆ దిశగా మేం పూర్తి అంకితభావంతో, దృఢ నిశ్చయంతో నిరంతరం పనిచేస్తున్నాం" అని ఆయన తెలిపారు.

పహల్గామ్ ఘటనను ప్రస్తావిస్తూ, "మన సోదరీమణుల సిందూరాన్ని ఎవరైనా తుడిచివేయాలని చూస్తే, వారి అంతు చూస్తాం. అందుకే ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదు. ఇది మన భారతీయుల సంస్కృతి, మనోభావాలకు నిదర్శనం" అని మోదీ భావోద్వేగంతో ప్రసంగించారు. "మాతృభూమిని, మానవత్వాన్ని కాపాడేందుకు మా తపస్సు, త్యాగానికి ఈ ప్రాంతం నిదర్శనం. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదులు చేసిన దానికి భారత్ మౌనంగా ఉంటుందా? మోదీ మౌనంగా ఉంటాడా? ఆ ఉగ్రవాదులు 140 కోట్ల మంది భారతీయులను సవాలు చేశారు. అందుకే, దేశ ప్రజలు నాకు అప్పగించిన ప్రధాన సేవకుడి బాధ్యతను నేను నిర్వర్తించాను" అని ఆయన వివరించారు.

పహల్గామ్‌లో 26 మంది మృతికి కారణమైన భయానక ఘటనను గుర్తుచేసుకుంటూ, "పిల్లల ముందే తండ్రులను కాల్చి చంపారు (పహల్గామ్‌లో). ఆ చిత్రాలు చూస్తే రక్తం మరిగిపోతుంది. ఉగ్రవాదులు 140 కోట్ల మంది భారతీయులను సవాలు చేశారు, అందుకే మీరు నాకు ప్రధానమంత్రిగా ఇచ్చిన బాధ్యతను నిర్వర్తించాను... భద్రతా బలగాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాను. మన వీరులు దశాబ్దాలుగా ప్రపంచం చూడని విధంగా పనిచేశారు... మేం తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను గుర్తించాం. వాటి ఉనికిని ధృవీకరించుకున్నాం. 22 నిమిషాల్లో వాళ్లను మట్టిలో కలిపేశాం" అని ప్రధాని మోదీ ఘాటుగా వ్యాఖ్యానించారు.

# కడప మహానాడుకు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

పాటు పలు చరిత్రాత్మక నిర్ణయాలకు వేదికగా నిలవనుంది. తొలిరోజు 27న పార్టీ ప్రతినిధుల సభ, సంస్థాగత నిర్మాణం, భవిష్యత్తు కార్యాచరణతో పాటు టీడీపీ మౌలిక సిద్ధాంతాలు, మంత్రి లోకేశ్ ప్రతిపాదించిన 6 సూత్రాల ఆవిష్కరణ, పార్టీ నియామవళి లో సవరణలపై ప్రధాన చర్చ జరగనుంది. అలాగే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ఆ తర్వాత పార్టీ కోసం పనిచేసి మృతిచెందిన కార్యకర్తలు, నేతలకు సంతాపం తెలియ జేస్తారు. తర్వాత ప్రధాన కార్యదర్శి నివేదిక సమర్పిస్తారు. 11.30 గంటలకు రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్వాగతోపన్యాసం చేస్తారు. కోశాధికారి పార్టీ జమాఖర్చుల నివేదిక సమర్పిస్తారు. 11.50 గంటలకు పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభోపన్యాసం చేస్తారు. అనంతరం టీడీపీ మౌలిక సిద్ధాంతాలపై చర్చించనున్నారు. స్వర్ణాంధ్ర సాధన, పార్టీ నిర్వహణ, మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ రూపొందించిన 6 సూత్రాల ఆవిష్కరణ, పార్టీ నియమావళిలో సవరణలపై ప్రధానంగా చర్చ జరుగుతుంది. మండల స్థాయిలో మూడు విడతలు ఒకే పదవి చేసిన వారిని అంతకన్నా పెద్ద పదవికి పంపాలన్న నిర్ణయంతో పాటు పలు కీలక అంశాలపై చర్చ జరగనుంది. భోజన విరామం తర్వాత ఆరు సూత్రాల్లో మొదటిదైన 'కార్యకర్తే అధినేత' , రెండోదైన 'యువగళం'లో అంశంపై చర్చ జరుగుతుంది. మై టీడీపీ



యాప్‌తో పాటు కార్యకర్తల సంక్షేమం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా చర్చిస్తారు. రెండో రోజు బుధవారం ప్రతినిధుల సభతో పాటు- పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళి అర్పించనున్నారు. అనంతరం ఆరు సూత్రాల్లో మూడోదైన 'తెలుగుజాతి- విశ్వఖ్యాతి', నాలుగోదైన 'స్త్రీ శక్తి', ఐదో అంశం 'సామాజిక న్యాయం - పేదల ప్రగతి', చివరిదైన 'అన్నదాతకు అండ'గాపై చర్చించి, తీర్మానాలు చేస్తారు. సాయంత్రం 5.30కు పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నిక, ప్రమాణ స్వీకారం, అధ్యక్షుడి ప్రసంగం ఉంటాయి. మూడో రోజు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు 5 లక్షలమందితో భారీ బహిరంగసభ నిర్వహిస్తారు. ఇదిలావుంటే ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురవడంతో మహానాడు పనులకు అంతరాయం ఏర్పడింది.

ప్రాంగణమంతా బురదమయంగా మారింది. వేదిక వద్దకు నీరు వచ్చింది. వర్షం ఆగిపోయిన వెంటనే పనులు చేపట్టాలని మంత్రి నిమ్మల ఆదేశించారు. మహానాడు వేదిక దాదాపు పూర్తయింది. సువిశాల మైదానంలో తొలి రెండురోజులు ప్రతినిధుల సభ, చివరిరోజు బహిరంగ సభ, భోజనశాల, ముఖ్యమంత్రి సభ, ఆయన క్యాంపు కార్యాలయం ఇలా అన్నింటినీ సిద్ధం చేశారు. ప్రతినిధుల సభా వేదికపై దాదాపు 450 మంది కూర్చొనే విధంగా 164 అడుగుల వెడల్పున, 510 అడుగుల పొడవుతో నిర్మించారు. కింద 25వేల మంది కూర్చుని చర్చించేలా ఏర్పాట్లు- చేశారు. ఇప్పటికే పలువురు మంత్రులు కడప చేరుకున్నారు.



# ఈసారి ముందుగానే నైరుతి

న్యూఢిల్లీ,మే26 ఆంధ్ర ప్రగతి:

వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలకు చల్లని కబురు అందింది. నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ముందుగానే దేశంలోకి ప్రవేశించి, కేరళ అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో కూడా అడుగుపెట్టాయి. రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతంలోకి సోమవారం ప్రవేశించడంతో వర్షాల కోసం ఎదురుచూస్తున్న రైతుల్లో ఆశలు చిగురించాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణ సమయం కంటే ఎనిమిది రోజుల ముందుగా, మే 24వ తేదీనే కేరళ తీరాన్ని తాకాయి. గతంలో 2009వ సంవత్సరం మే 23న సాధారణం కంటే ముందుగానే రుతుపవనాలు కేరళను పలకరించినట్లు వాతావరణ శాఖ నివేదికలు చెబుతున్నాయి. దాదాపు 16 సంవత్సరాల తర్వాత రుతుపవనాలు మరోసారి ముందుగా పలకరించాయి. ఇవి సోమవారం నాటికి రాయలసీమ ప్రాంతమంతటా విస్తరించాయి. శ్రీ సత్యసాయి జిల్లాలోని కొన్ని ప్రాంతాలు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇవి ప్రవేశించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో, రాబోయే కొద్ది రోజుల్లో రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలకు కూడా నైరుతి రుతుపవనాలు వేగంగా విస్తరించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. రుతుపవనాల రాకతో రాయలసీమలోని పలు ప్రాంతాల్లో వాతావరణం చల్లబడింది. రైతులు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు. రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసి, రాష్ట్రంలోని జలాశయాలు నిండుతాయని, వ్యవసాయానికి, తాగునీటికి ఇబ్బందులు తొలగిపోతాయని ప్రజలు ఆశిస్తున్నారు. అధికారులు కూడా రుతుపవనాల కదలికలను నిశితంగా పరిశీలిస్తూ, ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తున్నారు.

# మాజీ మంత్రి కాకాణికి 14 రోజుల రిమాండ్

## అక్రమ మైనింగ్ కేసులో కాకాణికి రిమాండ్

క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ ఆరోపణల కేసులో అరెస్టయిన వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి నెల్లూరు జిల్లా వెంకటగిరి కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించింది.

నెల్లూరు జిల్లా పరిధిలోని పొదలకూరు పోలీస్ స్టేషన్‌లో కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పలు తీవ్రమైన అభియోగాలు నమోదయ్యాయి. క్వార్ట్జ్ ఖనిజాన్ని అక్రమంగా తవ్వడం, దాన్ని అక్రమంగా రవాణా చేయడం, నిబంధనలకు వ్యతిరేకంగా పేలుడు పదార్థాలు ఉపయోగించడం వంటి ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా, ఈ అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నించిన స్థానిక గిరిజనులను బెదిరించారన్న ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయి. ఈ కేసులో కాకాణిని ఏ4గా పోలీసులు పేర్కొన్నారు. కోర్టు రిమాండ్ విధించడంతో ఆయన్ను జైలుకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

కాకాణి గోవర్ధన్‌రెడ్డిని బెంగళూరులో ఆంధ్రప్రదేశ్ పోలీసులు నిన్న అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అనంతరం ఈ ఉదయం ఆయన్ను నెల్లూరులోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం నుంచి భారీ భద్రతా ఏర్పాట్ల నడుమ వెంకటగిరి కోర్టుకు తరలించారు. మొత్తం తొమ్మిది పోలీసు వాహనాల కాన్వాయ్‌తో, ప్రత్యేక పోలీసు బలగాల పహారాలో ఆయనను వెంకటగిరికి తీసుకొచ్చి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. వాదనలు విన్న న్యాయమూర్తి, కాకాణికి జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ ఆదేశాలు ఇచ్చారు.

# 1000 దాటిన కరోనా కేసులు...

న్యూఢిల్లీ,**మే 26(రిపబ్లిక్ న్యూస్)**

భారతదేశంలో కరోనా వైరస్ కేసులు మళ్లీ పెరుగుతుండటంతో ప్రజల్లో కొంత ఆందోళన నెలకొంది. గత వారం రోజులుగా కేరళ, మహారాష్ట్ర, ఢిల్లీ, గుజరాత్, తమిళనాడు, కర్ణాటక వంటి పలు రాష్ట్రాల్లో కొత్త కేసులు నమోదవుతున్నాయి. దేశంలో పాజిటివ్ కేసుల సంఖ్య వెయ్యి దాటింది. ఈ నేపథ్యంలో, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బహల్ కీలకమైన సూచనలు చేశారు. కరోనా కొత్త వేరియంట్ల గురించి ఎక్కువగా భయపడాల్సిన అవసరం లేదని, అయితే ప్రజలందరూ అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యమని ఆయన నొక్కి చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని ప్రభుత్వం మరియు ఇతర సంబంధిత ఏజెన్సీలు నిశితంగా గమనిస్తున్నాయని డాక్టర్ బహల్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా, క్యాన్సర్ రోగులు లేదా రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ఎలాంటి ఇన్ఫెక్షన్ బారిన పడకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈరోజు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సమాచారం ప్రకారం, దేశవ్యాప్తంగా మొత్తం 1,009 క్రియాశీల కొవిడ్ కేసులు ఉన్నాయి. గత వారం వ్యవధిలో కొత్తగా 750 మందికి కరోనా సోకినట్లు వెల్లడించింది.

# కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)

ఈ క్రమంలో, ఈ నెల 28వ తేదీన తమ ఎదుట విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసులో స్పష్టం చేశారు. అయితే, ప్రస్తుతం కేటీఆర్ వ్యక్తిగత పర్యటన నిమిత్తం యూకే, అమెరికాలో ఉన్నారు.

ఈ నేపథ్యంలో, ఏసీబీ నోటీసులపై కేటీఆర్ స్పందించారు. తాను విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన వెంటనే విచారణకు హాజరవుతానని ఆయన ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చారు.

రాజకీయ వేధింపుల్లో భాగంగానే తనకు నోటీసులు ఇచ్చారని కేటీఆర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని అన్నారు. 48 గంటల క్రితం ఈడీ ఛార్జ్‌షీట్‌లో రేవంత్ పేరు వచ్చిందని, అందుకే ఆయన కక్షపూరిత చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. చట్టాన్ని గౌరవించే వ్యక్తిగా విచారణకు సహకరిస్తానని తెలిపారు. నోటీసులపై ఏసీబీకి లిఖితపూర్వక సమాచారం ఇచ్చినట్లు వెల్లడించారు.

# మంత్రివర్గ విస్తరణకు రాహుల్ ఓకే

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేబినెట్‌లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని కోరినట్లు చెప్పారు. కేబినెట్ కూర్పుపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని రాహుల్ చెప్పారన్నారు. రాష్ట్రానికి సంబంధించి కొన్ని విషయాలపై చర్చించినట్లు- తెలిపారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, జై బాపు, జై భీమ్ కార్యక్రమాల గురించి ఆయనకు వివరించినట్లు చెప్పారు. దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఓబీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రదేశ్ కమిటీ- అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సాయంత్రం కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీని కుటుంబ సమేతంగా కలిశారు. రాహుల్ గాంధీని కుటు-ంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశానని తెలిపారు. తెలంగాణకి సంబంధించిన కొన్ని అంశాలపై రాహుల్ కి వివరించాను.. అలాగే, వీలైనంత త్వరగా రాష్ట్ర కేబినెట్ కూర్పు చేయాలని మనవి చేశాను.. త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.. మంత్రివర్గ విస్తరణతో పాటు త్వరలోనే పీసీసీ కమిటీల ప్రకటన ఉంటుంది అన్నారు. అయితే, రాష్ట్ర కేబినెట్ విస్తరణ విషయంలో అధిష్టానానికి మేం మా అభిప్రాయం చెప్పామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. మంత్రి వర్గ విస్తరణలో బీసీలకు ప్రాతినిధ్యం ఉండాలని కోరుతున్నాం.. రాష్ట్రానికి సంబంధించిన అన్ని అంశాలు.. కేసి వేణుగోపాల్ పార్టీ అధిష్టాన పెద్దలతో మాట్లాడుతున్నారు.. ఒకట్రెండు రోజుల్లో పీసీసీ కార్యవర్గ ప్రకటన ఉంటుందని మహేష్ గౌడ్ వెల్లడించారు. ఇదిలావుంటే కాంగ్రెస్ ఒత్తిడి వల్లే కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాడానికి హస్తం పార్టీ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే, ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్లో ఓబీసీ ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించింది. ఈ సమావేశం ముగిసిన తర్వాత కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హన్మంతరావు మాట్లాడుతూ.. త్వరలోనే రాహుల్ గాంధీకి ధన్యవాద సభ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. భారత జోడో యాత్రలో రాహుల్ గాంధీ కీలక నిర్ణయం ప్రకటించాడు.. అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని అప్పుడే వెల్లడించారు.. అందులో భాగంగానే.. దేశంలోనే మొట్ట మొదట తెలంగాణలో కులగణన చేశామని హన్మంతరావు తెలిపారు. రాబోయే లోకల్ బాడీ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు జరుగుతాయని మాజీ ఎంపీ వి. హన్మంతరావు పేర్కొన్నారు. ఆలిండియా కాంగ్రెస్ కమిటీ- ఆధ్వర్యంలో.. దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాల నుంచి బీసీ నేతలను పిలిచి సమావేశం నిర్వహించారు.. అయితే, మోడీ పదేళ్లు ప్రధానిగా ఉన్నా.. బీసీలకు మాత్రం మేలు చేయడం లేదు అని ఆరోపించారు. ఓబీసీ ఎంపీల కన్వీనర్ గా మూడు సార్లు ప్రధానిని కలిశాను.. కులగణన చెయ్యాలని కోరాను.. కానీ, ఇప్పటి వరకు చేయలేదు.. త్వరలోనే కులగణన చేస్తామని చెప్పారని వీహెచ్ వెల్లడించారు.

# యోగాంధ్ర కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

**-సచివాలయాల సిబ్బంది ద్వారా యోగ పట్ల ఉత్సాహం, అవగాహన కల్పించండి**

**-నమోదు ప్రక్రియను వేగవంతం చేయండి.-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే, 26:**
యోగాసనాల ద్వారా మంచి ఆరోగ్యం చేకూరుతుందని... యోగాంధ్ర కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వం నిర్దేశించిన అంశాలపై పటిష్ట ప్రణాళిక రూపొందించుకొని ఆ మేరకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం యోగాంధ్రపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు ప్రభుత్వం నిర్దేశించిన అంశాలపై పక్కా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికి వెళ్లి యోగ యోగ పై అవగాహన కల్పించడంతోపాటు ప్రతి ఒక్కరిని యోగాంధ్ర యాప్ లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల సిబ్బంది వారి కుటుంబ సభ్యులందరూ నమోదు కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఉపాధి శ్రామికులు, కార్మికులు, విద్యార్థులు ఉపాధ్యాయులందరూ యోగాంధ్రా కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా స్థాయిలో ఇప్పటి వరకు మాస్టర్ ట్రైనర్లు 130 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. వీరి ద్వారా ప్రతి మండలంలో 200 మందికి శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శిక్షణ పొందే వ్యక్తులందరూ యోగాంధ్ర యాప్ లో రిజిస్ట్రేషన్ నమోదు కావాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న ఐదు పర్యాటక ప్రదేశాల్లో కూడా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని... ఈ నెల 31వ తేదీన శ్రీశైలం ఆలయ ప్రాంగణంలో 1000 మందిచే యోగ ఆసనాలు చేయించేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అలాగే జూన్ 7వ తేదీన మహానందిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేందుకు అధికారుల సిద్ధం అవ్వాలని కలెక్టర్ తెలిపారు. నంద్యాల పట్టణంలో జూన్ 16వ తేదీన ప్రభుత్వ ఉద్యోగులు, సచివాలయ సిబ్బందితో యోగ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమంలో చిన్నారులు, యువతను కూడా భాగస్వామ్యం చేసేందుకు యోగాకు సంబంధించి పలు పోటీ కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డిఆర్డిఎ పిడి, డిప్యూటీ సిఈఓలను ఆదేశించారు. యోగ ట్రైనర్స్ ద్వారా శిక్షణను ఇప్పించేందుకు ఆయుష్మాన్ శాఖ అధికారి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# ప్రజా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపండి

**-సర్వే ప్రక్రియను పూర్తి చేయండి.**

**-పిజిఆర్ఎస్ కు 246 దరఖాస్తులు.**

**-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే 26:**
ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను నాణ్యతతో వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రజల నుండి స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యతతో వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వీకరించిన ప్రతి సమస్యకు ఖచ్చితమైన పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ ఆదేశించారు. రీఓపెన్



అయిన 48 దరఖాస్తులను పరిశీలించి జాగ్రత్తగా నాణ్యతతో తక్షణమే పరిష్కరించాలన్నారు. అలాగే పెండింగ్లో ఉన్న 1374 ఫిర్యాదులకు సంబంధించిన ఆడిట్ ను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై అర్జీదారుల అభిప్రాయ సేకరణకు సంబంధించి ఇంకా 42.83 శాతం పెండింగ్లో ఉన్న డేటాను త్వరితగతిన సేకరించేలా చర్యలు తీసుకోవాలని డిఎల్డిఓలను కలెక్టర్ ఆదేశించారు.గ్రామ, వార్డు సచివాలయ సర్వేలలో భాగంగా మన మిత్ర క్యాంపెయిన్ కు సంబంధించి ఇంకా 12,724 పెండింగ్ ఉందని, సిటిజన్ ఈకేవైసి 2,23,024 మందికి పెండింగ్ లో ఉన్నాయన్నారు. చిల్డ్రన్ విత్అవుట్ ఆధార్ 6,554, హౌసింగ్ ఇమేజ్ జియో కోఆర్డినేట్ కు సంబంధించి 622 పెండింగులో ఉన్నాయని వాటిని తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.పాణ్యం మండలానికి చెందిన మేకల అడవి రాముడు చెంచు కాలనీలోని చెంచులకు ప్రభుత్వం సామాజిక అటవీ హక్కుల క్రింద ఒక్కొకరికి 3.50 ఎకరాల చొప్పున 14 ఎకరాలు ఇవ్వడం జరిగిందని, వర్షాల వల్ల గ్రామంలో ఉండే కాలువ తెగిపోయి పంట పొలాల్లోకి వర్షపు నీరు వస్తున్నాయని కాలువను మరమ్మత్తు చేయించాలని జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.బండి ఆత్మకూరు మండలం ఈర్నిపాడు గ్రామానికి చెందిన సిద్ధం రెడ్డి శివారెడ్డి తనకు 165 సర్వే నెంబరులో తనకున్న భూమిని ఆన్లైన్ లో నమోదు చేయించగలరని కలెక్టర్ కు అర్జీ సమర్పించుకున్నారు.జూపాడుబంగ్లా మండలం, పారుమంచాల గ్రామానికి చెందిన గ్రామస్థులు వారి కాలనీలలో 25 మంది నివాసం ఉంటున్నామని, మా కాలనీలో వీధి దీపాలు లేక చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, మా వీధిలో వీధిదీపాలు ఏర్పాటు చేయించగలరని కలెక్టర్ కు వినతిపత్రం సమర్పించుకున్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో 246 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# వివాహం సందర్భంగా సేవా విరాళం

**-స్ఫూర్తి దాయకమైన ఆత్మకూరు సుదర్శనం శెట్టి సేవా దృక్పథం.**

**-నంద్యాల లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు లక్ష రూపాయల విరాళం.**



లయన్స్ క్లబ్ కు లక్ష రూపాయల చెక్కు అందజేస్తున్న ఆత్మకూరు సుదర్శనం శెట్టి, నూతన వధూవరులు మిథున్ శ్రీ వాత్సవ్, సింధుష లు.



ఆత్మకూరు సుదర్శనం శెట్టిని సత్కరిస్తున్న డాక్టర్ రవి కృష్ణ ,డాక్టర్ సహదేవుడు, అధ్యక్షులు నిజాముద్దీన్ ,లయన్స్ క్లబ్ సభ్యులు.

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 26:**
నంద్యాల లయన్స్ క్లబ్ వ్యవస్థాపక సభ్యులు, పారిశ్రామికవేత్త ఆత్మకూరు సుదర్శనం శెట్టి తన మనవడి వివాహ సందర్భంగా నంద్యాల లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలకు లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఆత్మకూరు సుదర్శనం శెట్టి, రుక్మిణమ్మ దంపతుల మనవడు మిథున్ శ్రీ వాత్సవ్, సింధూష ల వివాహం సందర్భంగా సేవా కార్యక్రమాల కోసం లక్ష రూపాయల చెక్కు లయన్స్ క్లబ్ సీనియర్ నాయకులు డాక్టర్ సహదేవుడు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ లకు నూతన దంపతుల చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ,డాక్టర్ సహదేవుడు మాట్లాడుతూ నంద్యాల లయన్స్ క్లబ్ 1970లో ప్రారంభించినప్పుడు సభ్యుడిగా చేరిన ఆత్మకూరు సుదర్శనం శెట్టి 55 సంవత్సరాలుగా లయన్స్ సేవా సంస్థలో సభ్యునిగా కొనసాగుతూ అనేక సేవా కార్యక్రమాలకు సహకారం అందించారని, తన మనవడి వివాహ సందర్భంగా చూపిన సేవా దృక్పథం అందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ తరపున ఆత్మకూర్ సుదర్శనం శెట్టిని శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు.
ఈ కార్యక్రమంలో ఆత్మకూరు సుదర్శనం శెట్టి సతీమణి రుక్మిణి, కుటుంబ సభ్యులు చంద్రమోహన్,నిర్మల,రవి కుమార్, మాధవి,రజత్ భార్గవ, ప్రతీక్ష ,లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నిజాముద్దీన్, శిరిగిరి రమేష్, కోశాధికారి మామిళ్ల నాగరాజు, జోన్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, సీనియర్ సభ్యులు ఆంజనేయులు గుప్తా, ఆడిటర్ వంక దారి గోపాల కృష్ణ మూర్తి, రవి ప్రకాష్, శ్రీకాంత్, కసెట్టి వేణుమాధవ్ ,చంద్రమోహన్,బాబురావు, సోమేశుల నాగరాజు, రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహానంది మండలంలో ఏకధాటిగా వర్షం

**-పొంగి పొర్లిన డ్రైనేజీ కాలువలు. -ఇళ్లల్లోకి చేరిన నీరు..కాలనీలు జలమయం.**

**ఆంధ్ర ప్రగతి మహానంది మే 26:**
మహానంది మండలంలోని గ్రామాల్లో ఏకధాటిగా వర్షం కురిసింది. సోమవారం మధ్యాహ్నం నుండి గాజులపల్లె గ్రామంలో ఎడతెరపి లేకుండా వర్షంకురుస్తుండడంతో ,గ్రామంలోని వీధులు,రోడ్లు జలమయమయ్యాయి. నీళ్లన్నీ ఇళ్లలో చేరడంతో పలు వార్డుల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓసి కాలనీలోకి వర్షం నీరు చేరడంతో కాలనీవాసులు పలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.గ్రామంలోని చిరు వ్యాపారాలు సైతం అవస్థలు పడ్డారు.గాజులపల్లి మెట్ట



యందు డ్రైనేజీ కాలువలో మురుగునీరు ముందుకు సాగే విధంగా లేకపోవడంతో ఇళ్లల్లోకి వచ్చి అవస్థలు పడ్డారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వర్షాలు కురిసినప్పుడు మెట్టమీద డ్రైనేజీ మురుగునీరు ముందుకు సాగే విధంగా లేకపోవడంతో, గత కొన్ని సంవత్సరాలుగా ఇళ్లల్లోకి మురుగునీరు చేరి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారులు స్పందించి డ్రైనేజీ మురుగునీరు ముందుకు సాగే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# నిరుద్యోగ యువత జాబ్ మేళా ద్వారా ఉపాధి పొందండి

**-జూన్ 5వ తేదీన బనగానపల్లిలో కెజిఆర్ డిగ్రీ కళాశాల జాబ్ మేళా.**

**-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే, 26:** ఉపాధి అవకాశాల కోసం యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం జాబ్ మేళా పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఆర్ఓ రాము నాయక్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి. శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు కోసం యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 3 జాబ్ మేళాలు నిర్వహించడం జరిగిందని తద్వారా ఎంతో మంది యువత ఉపాధి పొందడం జరిగిందన్నారు. ఇంకా భవిష్యత్తులో మరిన్ని ఉపాధి అవకాశాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో యువతకు కల్పించడం జరుగుతుందన్నారు. జూన్ నెల 5వ తేదీన బనగానపల్లి నియోజకవర్గంలో కెజిఆర్ డిగ్రీ కళాశాల ఆవరణంలో మెగా జాబ్ మేళ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాకు 15 ప్రైవేటు కంపెనీల యూనిచార్మ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, ఎన్ఎస్ ఇన్స్ట్రుమెంట్స్, డైకిన్, క్వేస్ కార్ప్ , అన్నపూర్ణ ఫైనాన్స్ లిమిటెడ్, మెడ్ ప్లస్, ఆర్బిఎస్ ట్రాన్స్మిషన్, జొమాటో, దొడ్ల డైరీ, అమిటి మార్కెటింగ్, ఆల్ డిక్సన్ టెక్నాలజీ, హెటిరో, యాక్సిస్ బ్యాంక్, షిరిడి సాయి ఎలక్ట్రికల్స్, అమెజాన్ కు చెందిన ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఈ జాబ్ మేళాలో పదవ తరగతి, ఐటిఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, బి.టెక్ (మెకానికల్), బి/డి/ఎం ఫార్మసీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. కావున జిల్లాలోని నిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరములకు సంబంధించి 8688651650, 9705998056 నెంబర్లకు లేదా **naipunyam.ap.gov.in** సంప్రదించాలన్నారు.

# వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి.

**-ఐగాట్ కోర్సులను పూర్తి చేయండి.**

**-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మే, 26:**



ముందస్తు నైరుతి రుతుపవనాల ప్రభావంతో అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం అధిక వర్షాలు, ఐగాట్ కోర్సు పూర్తి పై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్ డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో ఈదురు గాలులు, ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఇందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ తీగలు జారిపోవడం, మట్టి మిద్దెలు కూలిపోవడం వల్ల ప్రాణా నష్టం సంభవించే అవకాశం ఉందని సంబంధిత అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను కలెక్టర్ సూచించారు. గ్రామాల్లో చెత్తాచెదారం ఎక్కడికక్కడ పేరుకుపోయి అపరిశుభ్రంగా ఉన్నాయని పరిశుభ్రం చేసేందుకు ఈఓఆర్డిలు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు, పారిశుద్ధ్య సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహిస్తామని సిబ్బంది అందరూ హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఈఓ, డిపిఓ, డిఎల్డిఓలను కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐగాట్ కర్మయోగి యాప్ లో అందిస్తున్న వివిధ కోర్సుల ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ మిషన్ కర్మయోగి ద్వారా ప్రభుత్వ సిబ్బంది సామర్థ్యాలను పెంపొందించడం, నైపుణ్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా రూపొందించడం జరిగిందన్నారు. ఈ యాప్ లో చాలా రకాల కోర్సులను అందించడం జరుగుతోందని అందులో 3 తప్పనిసరి కోర్సులను ప్రభుత్వ ఉద్యోగులు ఉత్తీర్ణత సాధించాలని తద్వారా సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.

# సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు

**-ఎ పి ఫుడ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నరహరి విశ్వనాధ్ రెడ్డి.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మే 26:**



కేంద్ర ప్రభుత్వం ద్వారా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సహకారం తో సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ నుంచి వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాధ్ రెడ్డి అన్నారు. సోమవారం విజయవాడలోని కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎ పి ఫుడ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ విజయకుమార్ యాదవ్ ను సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ నరహరి విశ్వనాధ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నరహరి విశ్వనాధ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ కు అన్ని సహాయ సహకారాలు అందించేందుకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ద్వారా కృషి చేస్తానని, రాష్ట్రం నుంచి సెంట్రల్ ఫుడ్ కార్పొరేషన్ డైరెక్టర్ గా తనకు అవకాశం కల్పించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి , మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి లకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని నరహరి విశ్వనాధ్ రెడ్డి అన్నారు.

# కడప గడప మహానాడును చారిత్రాత్మకంగా జరుపుకుందాం.

**-38వ వార్డు ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 26:**



38వ వార్డు ఇంచార్జ్ తాటికొండ బుగ్గ రాముడు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా టిడిపి కార్యకర్తలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మహానాడు తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత కడప గడపలో ఈనెల 27, 28, 29, 2025 తేదీలలో మహానాడు గతంలో ఎన్నడు జరగని విధంగా కనివిని ఎరుగని రీతిలో నిర్వహించ బడుతుందని.27వ తేదీ పార్టీ ప్రతినిధుల సభ పార్టీ విధివిధానాలు సిద్ధాంతాలు కార్యచరణ పై కేడర్ కు దిశా నిర్దేశం చేయనున్నారని 28వ తేదీ ప్రతినిధుల సభతో పాటు కూటమి ప్రభుత్వం చేపట్టిన పలు అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై రూపొందించిన ముసాయిదా తీర్మానంపై చర్చించనున్నారు.29వ తేదీ 10 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ మహానాడు కార్యక్రమానికి ఉమ్మడి కర్నూలు,నంద్యాల జిల్లాలోని ప్రతి నియోజకవర్గము నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు, అభిమానులు అదేవిధంగా విష్ణుసేన అభిమానులు కడప మహానాడు ను చారిత్రాత్మకంగా జరుపుకుందామని అన్నారు.

# గిన్నిస్ రికార్డు పై ఎల్ఐసి సిబ్బంది సంబరాలు.

**-ఎల్ఐసి పై విశ్వాసానికి, ఏజెంట్ల సిబ్బంది సత్తాకు ఇది ప్రతీక.**

**-గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ బ్యానర్ ను ఆవిష్కరించిన నంద్యాల బ్రాంచ్ మేనేజర్ శివ శంకర్ కుమార్.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 26:** 2025 జనవరి 20న ఒక్కరోజులో అత్యధిక పాలసీలు సేకరించిన జీవిత బీమా సంస్థగా ప్రపంచ రికార్డు సాధించడం ఎల్ఐసి ఏజెంట్ల సత్తాకు, సిబ్బంది నిబద్ధతకు, కస్టమర్ల నమ్మకానికి ప్రతీక అని ఎల్ఐసి, బ్రాంచ్ మేనేజర్ శివ శంకర్ కుమార్ అన్నారు. ఎల్ఐసి కార్యాలయ ఆవరణలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు బ్యానర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో, ప్రపంచంలో ఎన్నో జీవిత బీమా సంస్థలు ఉన్నప్పటికీ, ఎల్ఐసి మాత్రమే అగ్రస్థానం లో ఉందని అన్నారు. చైర్ పర్సన్ సిద్ధార్థ మహంతి గారీ పిలుపు మేరకు ఈ అరుదైన సంచలనాన్ని కేవలం ఒక్కరోజులో, 24 గంటలలో ఈ వరల్డ్ రికార్డు పాలసీలు సేకరించడం గర్వకారణం అని అన్నారు. ఆరోజు దేశవ్యాప్తంగా 4,52,839 మంది ఏజెంట్లు 5,88,107 పాలసీలు అమ్మడం తో ఈ అపూర్వమైన రికార్డు సృష్టించడం సాధ్యమైందని అన్నారు. ఈ గిన్నిస్ రికార్డుకు సంబంధించిన ధ్రువపత్రాన్ని ఆ సంస్థ ప్రతినిధులు మే 24న ముంబైలో ఎల్ఐసి సీఈవో సిద్ధార్థ మహంతి కి అందజేశారని అన్నారు. ఎల్ఐసి సాధించిన దానితో సంతృప్తి చెందకుండా కస్టమర్లకు మరింత అంకితభావంతో సేవలందించాలని, నంద్యాల బ్రాంచ్ మరిన్ని రికార్డులు సాధించే దిశగా ఈ ఆర్థిక సంవత్సరంలో పనిచేద్దామని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బి ఎమ్ (ఏ) గడ్డం సుబ్బ నరసింహులు , ఏ రమేష్ బాబు, డెవలప్మెంట్ ఆఫీసర్స్, ఎల్ఐసి ఏజెంట్ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆశీర్వాదాలతో సేవాకార్యక్రమాలను కొనసాగిస్తున్నాం

**-మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 26:**
శిల్పా సేవాసమితి ద్వారా గత 15 సంవత్సరాల నుండి భగవంతుని మరియు ప్రజల ఆశీర్వాదాలతో నిరంతరాయంగా సేవాకార్యక్రమాలను కొనసాగిస్తున్నామని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి పేర్కొన్నారు. పేదింటి మహిళల ఉపాధికల్పనకు తమవంతుగా చేస్తున్న సేవాకార్యమాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్థికంగా భలోపేతం కావాలని ఆయన కోరారు. సోమవారం స్థానిక శిల్పా సేవాసమితి కార్యాలయంలో శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ ఆధ్వర్యంలో 180 మంది లబ్దిదారులకు 26లక్షల 20వేల రూపాయల విలువగల చెక్ లను ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ... గత 15 సంవత్సరాల నుండి శిల్పా సేవాసమితి ద్వారా అనేక సేవాకార్యక్రమాలను నిర్విరామంగా చేపడుతున్నామని, అందుకు భగవంతుని, ప్రజల ఆశీర్వాదాలు తమపై ఉన్నాయన్నారు. పేదింటి మహిళలకు ఉపాధికల్పించేందుకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను చేపడుతూ నేటికి 8వేల మంది మహిళలకు ఉచితంగా వివిధ ఉపాధి రంగాలలో శిక్షణ అందించామన్నారు. అలాగే రాష్ట్రంలో నిర్వహిస్తున్న కో-పరేటివ్ బ్యాంక్ లలో నూటికి నూరుశాతం రుణాల రికవరీ చేసిన ఏకైక సంస్థగా గుర్తింపు కలిగినదని, అందుకు శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ సిబ్బంది కృషి, లబ్దిదారులైన మహిళల క్రమశిక్షణ, నిబద్ధత మాత్రమేనన్నారు. భవిషత్తులో పేద మహిళలను మరింత అభివృద్ధిలోకి తీసుకురావాడానికి కృషిచేస్తున్నామని, అందుకు వారి సలహాలను, అభిప్రాయాలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. రుణాలు పొందిన లబ్ధిదారులైన మహిళలు సకాలంలో తిరిగి చెల్లించి తోటి మహిళలకు సహకరించాలని తద్వారా మరింత పురోగతి సాధించడం జరుగుతుందని సూచించారు. సేవాకార్యక్రమాలను నిర్వహించడం వల్ల తమకు సంతృప్తి కలుగుతుందని, కాబట్టి ఓడినా గెలిచినా శిల్పా సేవాసమితి ద్వార చేపడుతున్న సేవాకార్యక్రమాలను నిరంతరంగా కొనసాగిస్తున్నామన్నారు. భవిషత్తులో మంచి రోజులు రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అతిధులుగా ఎంపీపీ శెట్టి ప్రభాకర్, కౌన్సిలర్ చంద్రశేఖర్, వైఎస్సార్సీపీ నాయకుడు శ్రీరాములు,మా బాషా ,శివ నాగిరెడ్డి, మహిళా సహకార్ బ్యాంక్ మేనేజర్ హరిలీల, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

# దేశ సమగ్రత పరిరక్షణ కోసమై సమైక్యత యాత్ర ర్యాలీ

**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 26:**
పహల్గంలో ఉగ్ర దాడికి పాల్పడిన ఉగ్రవాదులను పట్టుకున్నారా పట్టుకుంటే ఏం చేశారు. పాకిస్తాన్ నుండి మనదేశంలోకి 120 కిలోమీటర్ల దూరం రావడానికి ఎవరు సహాయం చేశారు ప్రతి కిలోమీటర్ మేరా కనీసం మూడు లేదా నాలుగు సార్లు గేట్లు ఏర్పాటు ఉండే అంతా కఠిన పరిస్థితుల్లో భారత్ కి నలుగురు ఉగ్రవాదులు ఎలా 120 కె ఎమ్ చేరుకోగలిగారు. భారత్ -పాకిస్తాన్ యుద్ధం ఎందుకు అంత త్వరితగతిన ముగించారు. మధ్యలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కి భారత దేశ ప్రజల మనోభావాలను తాకట్టు ఎందుకు పెట్టారు.నిజాలను ప్రజలకు తెలియజేయాలని యుద్ధం ఆపివేయడం వెనక ప్రజలకు చాలా అనుమానాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేయడం కోసం ప్రత్యేక పార్లమెంట్ సెషన్ ఏర్పాటు చేసి ప్రజలకు అన్ని వివరించాలని కోరుతూ మతసామరస్యం కాపాడాలని- దేశ సమగ్రత పరిరక్షణకై "సమైక్యత యాత్ర" వామపక్ష,ప్రజాతంత్ర, లౌకికవాదుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో టేక్కే మార్కెట్ యార్డ్ నుండి గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి దర్శనం లక్ష్మణ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, ముస్లిం జేఏసీ గౌరవాధ్యక్షులు అబ్దుల్ సమద్, అబులైజ్, ఉభయ రాష్ట్రాల క్రిస్టియన్ జేఏసీ ప్రధాన కార్యదర్శి మన్నెం. జానయ్య, సిపిఎం జిల్లా నాయకులు పుల్లా నరసింహులు, రత్నమయ్య,బాలవెంకటే, సిపిఎం సీనియర్ నాయకులు తోటమద్దులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే మహమ్మద్ గౌస్, పి వెంకట లింగం, పట్టణ కమిటీ సభ్యులు మౌలాలి, జైలాన్, వీరితోపాటు, సిపిఐ నాయకులు శ్రీనివాసులు, భూమని శ్రీనివాసులు, సుబ్బారావు, ఉసేని, రానా, నరసింహులు, అబ్దుల్లా, వీరితో పాటు వందమందికి పైగా సిపిఎం పార్టీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.
ర్యాలీ అనంతరం ఈ కార్యక్రమానికి సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు కే మహమ్మద్ గౌస్ అధ్యక్షత వహించగా సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, ముస్లిం




జేఏసీ గౌరవ అధ్యక్షులు అబ్దుల్ సమ్మద్, అబులైజ్, ఉభయ రాష్ట్రాల క్రిస్టియన్ జేఏసీ ప్రధాన కార్యదర్శి మన్నెం. జానయ్య, సిపిఎం జిల్లా నాయకులు పుల్లా నరసింహులు, రత్నమయ్య, బాలవెంకటే లు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గత నెల 22వ తేదీన ఉగ్రదాడి జరిగిన తర్వాత దేశంలో యావత్ ప్రజానీకం అంతా కేంద్ర ప్రభుత్వానికి, సైన్యానికి అన్ని రకాలుగా మద్దతు తెలిపి ఉగ్రవాదులను శిక్షించాలని, మత ఉన్మాదం నశించాలని బాసటగా నిలిస్తే భారత్ పాకిస్తాన్పై ఆపరేషన్ సింధూర్ చేపట్టి రెండు రోజులు గడపకముందే దాన్ని నిలిపివేశామని అమెరికా అధ్యక్షుడు ట్రంపు చెప్పడం ప్రజలందరినీ తీవ్ర నిరాశకు గురిచేసిందని భారతదేశాన్ని రక్షించేది ప్రధాని మోడీ గారే అని ప్రగల్బాలు పలికే వాళ్లంతా ముక్కున వేలేసుకుని మాట్లాడడం మానేశారని, పిఓకే కు శాశ్వత పరిష్కారం మేమే కల్పిస్తామన్న ట్రంపు వ్యాఖ్యల పైన మతోన్మాదాన్ని ప్రేరేపించేలా మతాల మధ్య చిచ్చుపెట్టేలా ఉందని అన్నారు. పెహల్గం లో జరిగిన ఉగ్రదాడిలో చనిపోయిన 26మంది కుటుంబాలకు ఏం న్యాయం చేయలేదని, భారత్-పాకిస్తాన్ యుద్ధంలో నిజంగా నలుగురు ఉగ్రవాదులను పట్టుకుని, శిక్షించారా? లేదో ప్రజలకు తెలియజేయాలని, అదేవిధంగా భారత్ పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధంలో భారత్కు ఎంత నష్టం వాటిల్లిందో ఎంతమంది సైన్యం చనిపోయారో ప్రజలకు వివరించాలని అదేవిధంగా పాకిస్తాన్ పై యుద్ధానికి సిద్ధమై దాడులు చేసి విజయం కోసం కృషి చేసిన సోఫియా ఖురేషిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి విజయ్ షా పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో ప్రజలకు చెప్పాలని, అన్ని వివరించిన తర్వాత దేశంలోని యావత్ ప్రజానీకాండంత కలుపుకుని నిర్వహించాల్సిన త్రిరంగ ర్యాలీ కేవలం కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడం కోసం తప్పులు కప్పిపుచ్చుకోవడం కోసమే నిర్వహించారని అన్నారు ముఖ్యంగా భారత్ పాకిస్తాన్ యుద్ధం ఆగిపోవడం వెనుక ట్రంప్ వాణిజ్య సంబంధాల మెరుగు కోసమే అని చెప్పిన వాటి వెనక అంతర్యం ఏమిటని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కి భారత దేశ ప్రజల మనోభావాలను ఎందుకు తాకట్టు పెట్టాల్సి వచ్చిందని బిజెపి ప్రభుత్వం ఎందుకు ట్రంప్ కాళ్ల మీద సాగిలపడిందని,నోరు మెదపడం లేదని, ఎందుకు ట్రంప్ మాట వినాల్సి వచ్చిందని, మధ్యలో భారత్- పాక్ చర్చలు జరుపకుండా, ట్రంప్ ఎంటర్ అయి యుద్ధం ఆపివేయడం వెనక ఉన్న ఆంతర్యాన్ని ప్రజలకు వివరించాలని, వీటితోపాటు అనేక రకాల బేతాళ ప్రశ్నలు యుద్ధం ఆగిపోవడం తర్వాత ప్రజల్లో మొదలయ్యాయని వాటిని నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు.

# మహనీయులను ఎల్లవేళల స్మరించుకోవాలి

**-సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి**

**ఆంధ్ర ప్రగతి డోన్ మే 26:**



మే 26 న సంఘసంస్కర్త రఘుపతి వెంకటరత్నం నాయుడు వర్ధంతి సందర్బంగాడోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి మాట్లాడుతూ..మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి తెలిపారు.శ్రీ ఆచార్య రఘుపతి వెంకటరత్నం నాయుడు గారు అక్టోబరు 1 - 1862 జన్మించారు. వీరు మంచి విద్యావేత్తగా, సంఘసంస్కర్తగా, పవిత్రతకు సంకేతంగా, బ్రహ్మర్షిగా ఆంధ్రప్రదేశ్ లో పేరుపొందిన వ్యక్తి. సంఘసంస్కరణోద్యమమన్నా, బ్రహ్మసమాజమన్నా గుర్తుకు వచ్చే పేరు కందుకూరి వీరేశలింగం పంతులుతోపాటు రఘుపతి వెంకటరత్నం నాయుడుదే. మహిళా విద్యావ్యాప్తికై నాయుడు కృషిచేసాడు. పి.ఆర్ కళాశాలలో స్త్రీలకు ప్రవేశం కల్పించడమే కాక, వెనుకబడిన వర్గాల, బీద విద్యార్థులకు వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేసాడు. బ్రహ్మసమాజంలో చేరి కాకినాడలో ఉపాసనా కేంద్రాన్ని నిర్మించాడు. బ్రహ్మసమాజ సిద్ధాంతాలలో ముఖ్యమైన 'కులవ్యవస్థ నిర్మూలన'కు కృషిచేసాడు. మద్యనిషేధం కొరకు శ్రమించాడు. 1923 లో మద్రాసు శాసనమండలి సభ్యుడుగా ఉన్నప్పుడు మద్యనిషేధం బిల్లు కొరకు ప్రభుత్వాన్ని వత్తిడిచేసాడు. పీపుల్స్ ఫ్రెండ్, ఫెలో వర్కర్స్ అనే పత్రికలకు సంపాదకత్వం నిర్వహించాడు. 'అపర సోక్రటీసు' గా ఆంధ్రాప్రజల మన్ననలందుకున్న రఘుపతి వెంకట రత్నం నాయుడుగారు 1939 మే 26వ తేదీన దివంగతులయ్యారు. ఇటువంటి మహానుభావులను ఎల్లవేళల స్మరించుకుంటూ దేశంలోని విద్యార్థులందరూ సమాజ సేవ లో భాగస్వాములై దేశానికి సేవ చేయాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.

# బీసీల హక్కుల కోసం ఉద్యమించాలి.

**-బీసీ చైతన్య వేధిక జాతీయ అధ్యక్షులు వీరపల్లి శ్రీనివాసులు.**

**-బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో నూతన జిల్లా కమిటీ ఏర్పాటు.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 26: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బీసీ నాయకులు బీసీల హక్కుల కోసం ఉద్యమం చేయాలని బీసీ చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు వీరపల్లి శ్రీనివాసులు పిలుపు నిచ్చారు. నంద్యాల పట్టణంలో బీసీ చైతన్య వేదిక ఆధ్వర్యంలో జాతీయ అధ్యక్షులు వీరపల్లి శ్రీనివాసులు ప్రధాన కార్యదర్శి చిందు నాగేశ్వర రావు అధ్యక్షతన నంద్యాల పట్టణంలోని శ్రీకృష్ణ దేవస్థానం నందు సోమవారం నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం జాతీయ అధ్యక్షులు వీరపల్లి శ్రీనివాసులు పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీసీలను రాజకీయంగా ఆర్థికంగా ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్న లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాలో జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 65% బీసీల జనాభా ఉంది.కానీ అగ్రవర్ణ రాజకీయ పార్టీలు బీసీలను రాజకీయంగా ఎదగకుండా లేనిపోని ఆంక్షలు పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయినప్పటికీ బీసీలు ముఖ్యమంత్రి స్థానంలో కూర్చోవడం జరగలేదని ఆయన ఆరోపించారు.ఇప్పటికైనా బీసీలు ఐకమత్యంతో బీసీ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. నంద్యాల నూతన జిల్లా కమిటీ ఎన్నిక కావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. నూతన నంద్యాల జిల్లా కమిటీకి ఆయన అభినందనలు తెలిపారు. బీసీల అభివృద్ధి ధ్యేయంగా ప్రతి ఒక్క రూ కలిసి పనిచేయాలని కమిటీకి సూచించారు. అదేవిధంగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర బీసీ అధ్యక్షులు వంగా అరుణ్ కుమార్ గౌడ్ హాజరయ్యారు నూతన కమిటీకి అరుణ్ కుమార్ గౌడ్ తన శుభాకాంక్షలు తెలియజేశారు.

# దేశ సమగ్రత పరిరక్షణ కోసం

# ప్రజలు, యువత ముందుకు రావాలి.

**ఆంధ్ర ప్రగతి ఆత్మకూరు మే 26:**
ఉగ్రవాదం మతోన్మాదం అనేవి ఏ ఒక్క కులానికి మతానికి సంబంధించినవి కాదని వీటిని రూపుమాపడానికి ప్రజలంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే ప్రభాకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.యేసు రత్నం, నర్సింహ నాయక్, కృషి పండ్ల తోటల సంఘం అధ్యక్షులు మహబూబ్ బాషా లు అన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక తెరిసా కాలేజ్ నందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మతసామరస్యం వర్ధిల్లాలి దేశ సమైక్యత సమగ్రత కోసం పాటుపడాలని నినాదంతో సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పహల్గాం ఘటనలో 26 మందిని బలిగొన్న ఉగ్రవాదులను పట్టుకోవడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందని ఆపరేషన్ సింధూరం పేరుతో పాకిస్థాన్పై దాడి ప్రారంభించిన మోడీ ప్రభుత్వం




అమెరికా అధ్యక్షుడు ట్రంపు ఆదేశాలతో కాల్పుల విరమణ చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. 370 ఆర్టికల్ రద్దు చేసిన కాశ్మీర్ సమస్యను పరిష్కరించలేక పోయిందని అన్నారు. ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు అక్కడి ముస్లింలే ఆశ్రయం కల్పించి వారు తమ తమ స్వస్థలాలకు వెళ్లడానికి తోడ్పడ్డారని గుర్తు చేశారు. భారతదేశ యువకులకు అమెరికా సంకెళ్లు వేసి సైనిక విమానంలో దేశానికి పంపించిన మోడీ మాట్లాడలేదన్నారు. యువకులను సొంత విమానాల్లో ఆయా దేశాలకు తీసుకెళ్లాయని తెలిపారు. ఈ రకమైన పాలనను ఎండగట్టి దేశంలో సోషలిజం స్థాపించడానికి కమ్యూనిస్టు పార్టీ ఒకటే ప్రత్యామ్నాయమని స్పష్టం చేశారు దేశ సమైక్యత సమగ్రత కోసం నిజాయితీగా నిలబడేది ఎర్రజెండా మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో వాకిటి పేట కౌలు రైతు సంఘం అధ్యక్షులు అశ్రఫ్ వలి, శ్రీనివాసులు, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఏం. రజాక్ పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్, పట్టణ నాయకులు డి రామ్ నాయక్, ఏ సురేంద్ర, జి నాగేశ్వరరావు, వీరన్న, కొత్తపల్లి మండల కార్యదర్శి ఎన్ స్వాములు, ఆత్మకూరు మండల నాయకులు చందా వారి వెంకటేశ్వర్లు, మా భాష, సంజీవ రాయుడు, దాసు, కిరణ్, పాలశివుడు,తుమ్మలూరు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# పాణ్యం లో గల సర్వే నెంబర్,1200 జూరవాగు దారికబ్జా



**ఆంధ్ర ప్రగతి పాణ్యం మే 26:**దేవ దత్తు,మాల మహానాడు నాయకుడు, వెంకటాద్రి, ఏఐఎఫ్ బి,నాయకుడు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాణ్యంమండలంలో గల ఒక ప్రైవేటు విద్యాలయం విజయానికేతన్ స్కూల్ వెనుక భాగంలో ఉన్నటువంటి ప్రభుత్వానికి చెందిన జుర్రాగు అనే స్థలము ఆక్రమణకు గురి అయినటువంటి సర్వే నెంబర్ 1200. ఈ కాలువ యొక్క విస్తీర్ణం ఆరు ఏకరములు వెడల్పు దాదాపుగా 100,గాను 60, అడుగులు కబ్జాకు గురైనది, దీనివన కాలువ యొక్క విస్తీర్ణం తగ్గి ఎప్పుడైనా ఫ్లడ్స్ వచ్చినపుడు వర్షాలు ఎక్కువగా కురిసిన విశాలంగా పారె నీరు ఒక్కసారిగా మరొకరి పొలాలలోకి ఫోర్స్ గా నీరు ప్రవహించటం వలన భూమి కోతకు గురి అయి పంట కుడా నష్ట పోతున్నాము.అని రైతులు ఆందోళన చెందుతున్నారు.వీరు ఆర్థికంగా రాజకీయంగా బలవంతులు కాబట్టి వారిని ఎదుర్కోవటానికి ఎవరు సాహసం చేయలేక పోతున్నారు.కాబట్టి శ్రీయుత తహసీల్దార్ గారు రైతులను ఈ కార్పొరేట్ వ్యవస్థ నుండి కాపాడండి.జిల్లా సర్వేయర్ తో సర్వే చేయించి తగిన చర్యలు తీసుకోండి. కార్యక్రమంలో చిరు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డ ఏడిఈ కి న్యాయం చేయాలని జిల్లా ఎస్ఈ కి వినతి పత్రం ఇచ్చిన రైతులు.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 26:**నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం చిన్నకంబులూరు , శ్రీరంగాపురం , మల్లీవత్తుల , డి.కొట్టాల గ్రామల రైతులు కే. మధుసూదన్ , గురుమూర్తి , పరమేష్ , సాయి రెడ్డి , నాగేశ్వరరావు తదితరులు రైతులు ఆళ్లగడ్డ ఏడిఈ రవికాంత్ చౌదరి కి న్యాయం చేయాలని స్థానిక జిల్లా కలెక్టర్ ఆఫీస్ ప్రాంగణంలో ఎస్ఈ సుధాకర్ కుమార్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా రైతుల మాట్లాడుతూ ఆళ్లగడ్డ ఏడిఈ రవికాంత్ చౌదరి మంచి మనిషి అని వారు ఎన్నో ప్రజలకు సహాయ సహకారాలు అందించారని అలాంటి మంచి మనిషిని కొందరు దురుద్దేశంతో ఏసీబీ అధికారులకు పట్టించడం జరిగిందన్నారు. ఎప్పుడు ఏమీ ఆశించకుండా రైతులకు సహకరించే వారిని అలాగే ఎన్నో సేవా కార్యక్రమాలు కూడా చేస్తుండే వాడని అన్నారు కావున అధికారులు దయ ఉంచి ఏడిఈ రవికాంత్ చౌదరి కి న్యాయం చేయాలని వినతిపత్రంలో కోరారు ఈ కార్యక్రమంలో రైతులు కామేశ్వరయ్య , మధుసూదన్ రావు, సుధాకర్, సర్వారెడ్డి , రంగస్వామి , బాలకాశి , సాయి రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మహానాడుకు వెళ్తూ కార్యకర్త కొట్టుకెళ్లి టీతాగిన లోకేష్..!

### -అభిమాన నేత కదిలిరావడంతో చెంగాచారి భావోద్వేగం.



**ఆంధ్ర ప్రగతి కుప్పం/శాంతిపురం మే 26:** కుప్పం నియోజకవర్గం శాంతిపురానికి చెందిన చెంగాచారి సాధారణ టిడిపి కార్యకర్త. గృహప్రవేశం నిమిత్తం కుప్పం వచ్చి గత రెండురోజులుగా బిజీబీజీగా ఉన్న రాష్ట్ర మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ను కలిశాడు. చెంగాచారి బాగోగులను వాకబుచేసిన లోకేష్ మాటల్లో ఏం చేస్తుంటావని అడిగాడు. తాను తెలుగుదేశం పార్టీ వీరాభిమానినని, శాంతిపురంలో టీకొట్టు నడపుతూ జీవనం సాగిస్తున్నానని చెప్పాడు. కుప్పం నుంచి కడప మహానాడుకు బయలుదేరిన యువనేత లోకేష్ సోమవారం సాయంత్రం అకస్మాత్తుగా టీకొట్టు వద్దకు వెళ్లాడు. అన్నా... చాలా దూరం వెళ్లాలి... టీ ఇస్తావా అని అడిగాడు. చెంగాచారికి కొద్దిసేపు నోటమాట రాలేదు. తమ అభిమాననేత నేరుగా తమ కొట్టుకురావడంతో సంభ్రమాశ్చర్యానికి లోనయ్యాడు. యువనేత లోకేష్ కు టీ గ్లాసు అందించాడు. వ్యాపారం ఎలా ఉందని అడగ్గా చెంగాచారి స్పందిస్తూ... సర్... నేను 1994 నుంచి తెలుగుదేశం పార్టీలో ఉంటున్నా. చంద్రబాబు గారంటే అభిమానం. నేను టిడిపికి చెందిన వాడినన్న కోపంతో గత అయిదేళ్లుగా నా టీ అంగడిని మూయించేశారు. గత ఏడాది జూన్ 12న చంద్రబాబు గారు సిఎంగా ప్రమాణ స్వీకారం చేశాక 17వతేదీ మళ్లీ టీకొట్టు ప్రారంభించా. నాకు ఇద్దరు ఆడబిడ్డలు, ఒకబిడ్డకు పెళ్లయింది... మరో కూతురికి పెళ్లి చేయాలి. మీరు మా అంగడికి రావడం నమ్మలేక పోతున్నా చిన్నయ్యా అంటూ భావోద్వేగానికి గురయ్యాడు. చెంగాచారి భుజం తట్టిన యువనేత లోకేష్... ఇప్పుడు నువ్వు ఎవరికీ భయపడాల్సిన పనిలేదు. నీ వెంట నేనున్నా... ఏ అవసరమొచ్చినా నాకు ఫోన్ చెయ్యి అని చెప్పి ముందుకు సాగారు. కార్యకర్తకు యువనేత లోకేష్ ఎంతటి ప్రాధాన్యత నిస్తారనడానికి ఇదొక మచ్చుతునక.

# కడపలో తెలుగుదేశం మహానాడు ను విజయవంతం చేయండి.

### -స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థాపించిన పార్టీ టీడీపీ. -రాష్ట్ర అభివృద్ధి కోసం మహానాడులో తీర్మానాలు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 16:**

కడప లో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు విజయవంతం చేయాలని ఏపీ మార్క్ ఫెడ్ డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి పిలుపునిచ్చారు.ఆయన స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడపలో మూడు రోజులు తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు ను విజయవంతం చేయాలని కోరారు.కడపలో ఈ నెల 27,28,29 మూడు రోజులపాటు మహానాడు జరుగుతుందని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 27 నా మహానాడు ను ప్రారంభిస్తారని అన్నారు.మహానాడులో రాష్ట్ర అభివృద్ధి,చేపట్టాల్సిన కార్యక్రమాలు,మేధావుల సలహాలు,సూచనలు,వివిధ అంశాలు నివేదిక చేసుకొని అందరి సహాయ సహకారాలతో తీర్మానాలు చేసి రాష్ట్రం అభివృద్ధి పయనంలో సాగేందుకు తీర్మానాలు తోడ్పడతాయని అన్నారు.స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు.పార్టీ ఆవిర్భావం నుంచి క్రమం తప్పకుండా మహానాడు ఏర్పాటుచేసి అభివృద్ధిపై తీర్మానాలు చేస్తున్నారని అన్నారు.అధినుంచి వస్తున్న సంప్రదాయాలను గౌరవిస్తూ మహానాడు ప్రతి ఏడాది కొనసాగిస్తూ ప్రజల వినతులు స్వీకరిస్తూ ప్రజలు మెచ్చే పాలన ,అభివృద్ధి రాష్ట్ర వ్యాప్తంగా అమలయ్యే విధంగా తీర్మానాలు చేస్తారన్నారు.మహానాడు చివరి రోజు 29 న భారీ సంఖ్యలో దాదాపు 5 లక్షల టీడీపీ అభిమానులు, కార్యకర్తలు, కుటుంబసభ్యులు హాజరవుతారన్నారు. మహానాడుకు హాజరయ్యే వారందరూ వచ్చేటప్పుడు, పోయేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహానాడు విజయవంతానికి ప్రతి కార్యకర్త హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# ఎస్.పి.ఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ను ప్రారంభించిన ఎన్ఎండి ఫిరోజ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మే 26:**

క్రీడలు మానసిక ఉల్లాసనికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయని టిడిపి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. ఈ సందర్భంగా 28 వ వార్డు టిడిపి ఇంచార్జ్ మరియు మాజీ కౌన్సిలర్ కృపాకర్ , 33 వ వార్డు టిడిపి ఇంచార్జ్ జోసఫ్ ఆధ్వర్యంలో ఫారుక్ యువసేన సభ్యులు స్థానిక ఎస్పీజీ గ్రౌండ్ నందు ఎస్.పి.ఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ క్రీడాల పట్ల యువత ఆసక్తిని పెంచుకోవాలని సూచించారు. ఈ టోర్నమెంట్ నిర్వహణకు నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేసినందుకు వారందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే గెలుపు ఓటములు సహజమని ఎవరు గెలిచినా ఎవరు ఓడిన అదేరపడకుండా మరల గెలవడానికి ప్రయత్నం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ధనరాజ్ , మధు , సాయి , ప్రవీణ్, 15 వార్డు టిడిపి ఇంచార్జ్ ఎబినేజర్ , జార్జ్ , శరత్, రంజిత్ , మాభాష , మున్నా, బేగ్ , ఇమాన్యుల్ తదితరులు పాల్గొన్నారు

# కవిత కొత్త పార్టీ ?

## -తండ్రి కేసీఆర్‌తో తేల్చుకోవాలనుకుంటున్న ఎమ్మెల్సీ కవిత.

### -ఆయన పిలుపు కోసం ఎదురుచూపు.. లేఖ లీకేజీపై ఆగ్రహంగా కేసీఆర్ తనయ.

### -లీకువీరులెవరో తేలే వరకు పార్టీకి దూరం.. పార్టీ పెడితే తెలంగాణ జాగృతే.?

### -రోజంతా ఇంటికే పరిమితం. భర్త తరపు కుటుంబం, సన్నిహితులతో మంతనాలు.

ఆంధ్ర ప్రగతి హైదరాబాద్ మే 26:
భారత రాష్ట్ర సమితిలో తగిన ప్రాధాన్యం దక్కకుంటే తన దారి తాను చూసుకోవాలనే యోచనలో కేసీఆర్ తనయ కవిత ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై అధిష్ఠానం స్పందన కోసం ఆమె ఎదురుచూస్తున్నారు. కేసీఆర్ నుంచి పిలుపు వస్తే అన్ని విషయాలు కూలంకుషంగా చర్చించాలనుకుంటున్నారు. ప్రధానంగా రెండు అంశాలపై ఆమె పట్టుబడుతున్నట్లు సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. పార్టీలో తిరిగి తనకు సముచిత ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె కోరుతున్నారు. అలాగే, కేసీఆర్ చుట్టూ ఉన్న కోటరీ, తాను ప్రస్తావించిన దయ్యాల సంగతి కూడా తేల్చాల్సిందేనని గట్టిగా పట్టుబడుతున్నారు. పార్టీ అధినేత సానుకూలంగా స్పందించకుంటే కఠినమైన నిర్ణయం తీసుకునే యోచనలో కవిత ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అవసరమైతే బీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లేందుకు కూడా ఆమె సిద్ధమైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కవిత కొత్త పార్టీ దిశగా అడుగులు వేసే అవకాశం లేకపోలేదని అంటున్నాయి. రెండు వారాల కిందటే కవిత కీలక నిర్ణయం తీసుకుంటుందని భావించారు. ఎందుకో కార్యరూపం దాల్చలేదు. తాను రాసిన లేఖపై కేసీఆర్ స్పందిస్తారని, తాను ప్రస్తావించిన అంశాలపై చర్చిస్తారని ఆమె భావించారని, కానీ అవేమీ జరగలేదని, మరికొంత సమయం కవిత ఎదురు చూశారని, ఈ లోగా ఆమె రాసిన లేఖ బయట పడిందని తెలిపాయి.

తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్ఎస్ నుంచి బయటకు వెళ్లాల్సివస్తే కొత్త పార్టీ పెట్టడం ఖాయమని కవిత సన్నిహితవర్గాలు వెల్లడించాయి. ఒకటి రెండు పేర్లు చర్చకు వచ్చినట్లు సమాచారం. తన మానస పుత్రిక తెలంగాణ జాగృతి సంస్థ పేరునే పార్టీ పేరుగా ఖరారు చేసే అవకాశాలు లేకపోలేదని సన్నిహితులు చెబుతున్నారు. తెలంగాణ బహుజన రాష్ట్ర సమితి(టీబీఆర్ఎస్) పేరును కూడా ఆమెతో సన్నిహితంగా ఉండే కొందరు బీసీ నేతలు తెరపైకి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తన లేఖ లీకేజీపై కవిత తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు ఆమె సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. తాను చెబుతున్న



దయ్యాలే వాటిని కావాలని బయటకు విడుదల చేసి ఉండాలని ఆమె భావిస్తున్నారు. ముందు లేఖ ఎలా లీకైందన్న విషయం బయటకు రావాల్సిందేనని కవిత పట్టుబడుతున్నట్లు తెలిసింది. గతంలోనూ అనేక చేదు అనుభవాలను కవిత ఎదుర్కొన్నారని సన్నిహిత వర్గాలు అంటున్నాయి. గతంలో కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడేందుకు కవిత పలుమార్లు ప్రయత్నించినా తన తండ్రికి ఫోన్ కూడా ఇవ్వకుండా చేశారని, ఇటువంటి పరిస్థితులు ఆమెకు మింగుడు పడకుండా చేశాయని సమాచారం. తన లేఖ లీకేజీ వీరులెవరో తెలిసేదాకా పార్టీ కార్యాలయానికి కానీ, కేసీఆర్ వద్దకు కానీ వెళ్లకూడదని మరో ఆలోచన కూడా కవితకు ఉన్నట్లు సన్నిహితులు చెబుతున్నారు. తాను రాసిన లేఖనే లీకు చేస్తారా అన్న ఆగ్రహావేశాలతో ఆమె ఉన్నట్లు జాగృతి వర్గాలు వెల్లడించాయి. ప్రధానంగా లీకు వీరులపై పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకోవాల్సిందేనని ఆమె డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. శనివారం ఎర్రవల్లిలో కేసీఆర్ ఫాంహౌజ్‌లో ఉన్న ఇద్దరు ముగ్గురితో కవిత ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం. లేఖలో కవిత పేర్కొన్న అంశాల్లో తప్పేముందన్న నేతలు లేకపోలేదు. కవిత లేఖ విషయంలో ఎవ్వరూ నొరెత్తవద్దన్న అధిష్ఠానం ఆదేశాల మేరకు అంతా గప్‌చుపగా ఉన్నారు. ఆమె ప్రస్తావించిన అంశాలు ఎంతో విలువైనవని మాత్రం అంటున్నారు. కేసీఆర్ కోటరీ విషయంలో కవిత ప్రస్తావించిన అంశాలపై బహిరంగంగా మీడియాతో మాట్లాడే ధైర్యం ఏ ఒక్కరూ చేయలేక పోతున్నారు. శనివారం నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ మాజీ ఎంపీపీ కవిత లేఖలో ప్రస్తావించిన అంశాలు సరైనవేననీ, దానిపై అధిష్ఠానం సీరియెసగా చర్చించాల్సిందేనని పిలుపునిచ్చారు. బీఆర్ఎసలో కవిత అంశంపై ఒక్క కేటీఆర్ తప్ప మిగిలిన వాళు అంతా మౌనముద్ర దాల్చారు. కేటీఆర్ కూడా కేసీఆర్ ఆదేశాల మేరకే కవిత అంశంపై స్పందించారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ అంతర్గత విషయాలను అంతర్గతంగానే మాట్లాడాలని చెప్పడం ద్వారా కవిత వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. ఒక రకంగా కవిత బహిరంగంగా అలా మాట్లాడటం సరికాదన్న ధోరణితో పార్టీ అధిష్ఠానం ఉన్నట్లు కేటీఆర్ వ్యాఖ్యల ద్వారా తేటతెల్లమైందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

శనివారమంతా ఇంటికే పరిమితం,శుక్రవారం రాత్రి విదేశాల నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న కవిత శనివారమంతా ఇంటికే పరిమితమయ్యారు. బయటకు రాలేదు. ప్రయాణ బడలిక కారణంగా కొంత సేపు కవిత విశ్రాంతి తీసుకున్నారని సన్నిహితులు వెల్లడించారు. ఎవర్నీ కలిసేందుకు కవిత ఇష్టపడలేదని తెలిపారు. ఆమె ఎవరికి అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని జాగృతి వర్గాలు వెల్లడించాయి. తన భర్త అనిల్ తరపున బంధువులే పెద్ద సంఖ్యలో వచ్చినట్లు తెలుస్తోంది. వారితో కొంతసేపు మంతనాలు జరిపినట్లు సమాచారం.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# చురుకుగా కదులుతున్న నైరుతి

## బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే ఛాన్స్



హైదరాబాద్,మే26 ఆంధ్ర ప్రగతి: నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులుతున్నాయి. ప్రస్తుతం రుతుపవనాలు లక్షద్వీప్, కేరళ రాష్ట్రంలో పూర్తిగా.. కర్ణాటక, తమిళనాడులోని కొన్ని ప్రాంతాల్లో విస్తరించాయి. వచ్చే రెండ్రోజుల్లో మధ్య అరేబియన్ సముద్రంలోని కొన్ని ప్రాంతాలు, గోవా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లోని మరికొన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. దక్షిణ కొంకణ్ తీరంలో రత్నగిరి, దాపోలి మధ్యలో వాయుగుండం తీరం దాటే అవకాశమున్నట్టు పేర్కొన్నది. ఈనెల 27న పశ్చిమ మధ్య, సమీప ఉత్తర బంగాళాఖాతం ప్రాంతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశమున్నట్టు వివరించింది. దీంతో రెండ్రోజులపాటు– రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అకక్కడక్కడ ఉరుములు, మెరుపులతో గంటకు 30నుంచి 40 కిలోమీటర్ల ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసినట్టు పేర్కొన్నది. సోమ, మంగళవారాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురవడంతోపాటు–, పలు ప్రాంతాల్లో పిడుగులు పడేఅవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. మరోవైపు అరేబియా సముద్రంలోని వాయుగుండం, ఉత్తర బంగాళాఖాతం లో ఏర్పడే అల్పపీడనం ప్రభావంతో ఏపీలో మూడ్రోజులు భారీ వర్షాలతోపాటు–, సముద్ర తీరం వెంబడి గంటకు 40–50కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కాగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో అత్యధికంగా 12.52సెం.మీ వర్షపాతం నమోదైంది.

# కాళేశ్వరంలో ముగింపునకు పుష్కరాలు

## చివరిరోజు భారీగా తరలివచ్చిన భక్తులు



కాళేశ్వరం,మే26 ఆంధ్ర ప్రగతి:
కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాలు ఘనంగా సాగుతున్నాయి. సోమవారంతో పుష్కరాలు ముగియనున్నాయి. దీంతో చివరి రోజైన సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. పవిత్ర త్రివేణి సంగమంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారు. ముగింపు వేడుకలను అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు– చేస్తున్నారు. తెలంగాణలో సరస్వతి నది పుష్కరాలు మే 15న ప్రారంభమైన సంగతి తెలిసిందే. కాళేశ్వరంలో ఆధ్యాత్మికతతో శోభిల్లిన సరస్వతి పుష్కరాలు నేటితో ముగియనున్నాయి. త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాల కోసం వేలాదిమంది భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే తెలంగాణ, ఆంధప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుండి భక్తులు తరలివచ్చారు. భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి నదిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పలువురు దంపతులు కలిసి త్రిగుణాత్మక నదుల సాన్నిధ్యంలో స్నానం చేసి పుణ్యఫలాన్ని అందుకుంటు–న్నారు. తీరం వెంట సైకత లింగాలను ఏర్పాటు– చేసి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అలాగే, పితృదేవతలకు శ్రాద్ధకర్మలతో తీరాన్ని పరిపూర్ణంగా అలాగే పుష్కరాల ముగింపు సందర్భంగా పూజారులు చండీ హోమాన్ని నిర్వహించనున్నారు. చివరి రోజు కావడంతో అధికారులు భారీగా భక్తుల రాకను ఊహించి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు– చేశారు. సరస్వతీ మాత, శుభానందదేవి అమ్మవారుల దర్శనార్థం లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. ఒకవైపు భక్తి భావన, మరోవైపు భక్తుల ఉత్సాహంతో కాళేశ్వరం పుష్కర క్షేత్రంగా ప్రకాశించింది.

## పాకిస్థాన్ కోరితే కాల్పుల విరమణకు అంగీకరించారు...

# కానీ మేం కోరితే...! : మావోయిస్టుల లేఖ

ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దుల్లోని నారాయణ్‌పూర్ సమీపంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో తమకు చెందిన 28 మంది సభ్యులు మరణించారని మావోయిస్టు వర్గాలు ప్రకటించాయి. మరణించిన వారిలో కీలక నేత బసవరాజు అలియాస్ కేశవరావు కూడా ఉన్నట్లు తెలిపింది. ఈ ఘటనకు సంబంధించి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి వికల్ప పేరుతో మావోయిస్టులు ఒక లేఖను విడుదల చేశారు. ఈ లేఖలో, ఎన్‌కౌంటర్‌లో ప్రభుత్వం ప్రకటించిన దానికంటే ఒకరు ఎక్కువగా మరణించారని పేర్కొన్నారు. భద్రతా బలగాలతో జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో 27 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు ప్రభుత్వం వెల్లడించిందని, అయితే మరో మృతదేహాన్ని తాము స్వాధీనం చేసుకున్నామని మావోయిస్టులు తెలిపారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 28కి చేరిందని వారు వివరించారు. అదే సమయంలో, కేంద్ర ప్రభుత్వంపై మావోయిస్టులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాకిస్థాన్ కోరితే కాల్పుల విరమణకు అంగీకరించే కేంద్రం, తాము చర్చల కోసం విజ్ఞప్తి చేసినప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. తమ శాంతి ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని లేఖలో విమర్శించారు.

# జ్యోతి మల్హోత్రాకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

## పాక్ గూఢచర్యం ఆరోపణలపై యూట్యూబర్ జ్యోతి అరెస్ట్

మే26 ఆంధ్ర ప్రగతి:



పాకిస్థాన్ కోసం గూఢచర్యం చేసిందన్న ఆరోపణలపై అరెస్టయిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ హర్యానాలోని హిసార్ స్థానిక కోర్టు ఆదేశాలు జారీ చేసింది. గత గురువారం ఆమె పోలీస్ కస్టడీ ముగియడంతో అధికారులు ఆమెను సోమవారం కోర్టు ముందు హాజరుపరిచారు. వివరాల్లోకి వెళితే, జ్యోతి మల్హోత్రాను మొదట ఐదు రోజుల పాటు పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. ఆ గడువు ముగిసిన అనంతరం, విచారణాధికారులు చేసిన అభ్యర్థన మేరకు కోర్టు మరో నాలుగు రోజులు పోలీస్ కస్టడీని పొడిగించింది. ఈ పొడిగించిన రిమాండ్ కూడా గత గురువారంతో పూర్తి కావడంతో, ఆమెను కోర్టు ముందు హాజరుపరిచారు. వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. పాకిస్థాన్ కోసం గూఢచర్య కార్యకలాపాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో ఇప్పటివరకు పది మందికి పైగా అరెస్టయ్యారు.

# జీవో 98 నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలి :సిపిఎం

### -ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం.

### -ప్రజా సంఘాలపై నిరుద్యోగులపై గత ప్రభుత్వం లో కేసులు. -ముఖ్యమంత్రి మంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.




**ఆంధ్ర ప్రగతి నందికొట్కూరు మే 26:**
నందికొట్కూర్, నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా నీటిమపు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నుండి స్థానిక ఎమ్మెల్యే వరకు హామీలు ఇవ్వడం తప్ప ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం వైఖరి ప్రదర్శిస్తున్నాయి అని సిపిఎం నాయకులు పీ,పక్కిరి ప్రభుత్వాలను విమర్శించారు. సోమవారం నందికొట్కూరు కోర్టుకు హాజరైన సందర్భంగా సిపిఎం నాయకులు నిరుద్యోగ సంఘం నాయకులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పి. పక్కిరిసాహెబ్ మాట్లాడుతూ.. గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ముచ్చుమరి ఎత్తిపోతల పథకానికి జలహారతికి ఇచ్చేందుకు వచ్చిన సందర్భంగా శ్రీశైలం నీటి ముంపునిరుద్యోగులకు కటాఫ్ తేదీ పెంచుతూ రెండవ జాబితాకు అర్హులైన నిరుద్యోగులను ఎంపిక చేసే విధంగా హామీ ఇచ్చారు అని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు జిల్లా కలెక్టర్ ముంపు గ్రామాలలో రెవెన్యూ అధికారులు చే ఓ ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి అర్హులైన 674 మంది నిరుద్యోగులను ఉద్యోగాలకు అర్హులుగా గుర్తించడం జరిగింది. అనంతరం ఎన్నికల్లో టిడిపి ప్రభుత్వం ఓడిపోయి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా ముంపు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని ఆశ చూపి నిరుద్యోగులను మోసం చేసిందని వారు విమర్శించారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని తాము ఎందుకు అమలు చేయాలని ధోరణితో వ్యవహరించి నీటి ముంపు నిరుద్యోగులకు ఐదేళ్లుగా అన్యాయం చేశారన్నారు, నిరుద్యోగులు ఉద్యోగాలకై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో మంత్రులను అడ్డుకోవడం జరిగిందని అప్పటికి స్పందించకపోవడంతో 1%శీ%4 రోజులు రిలే దీక్షలు చేపట్టి చివరికి హంద్రీనీవా లో దూకి ఆత్మహత్యలు చేసుకునేందుకు ప్రయత్నించడం జరిగిందని అయినా వైసీపీ ప్రభుత్వ స్పందించకపోగా సిపిఎం నాయకుల పై ప్రజాసంఘాల నాయకులు పై కేసులు నమోదు చేయడంతోఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. యువ గళంపాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ఎన్నికల ప్రచారంలో నందికొట్కూరు కు వచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియోజకవర్గంలో ప్రధాన సమస్య అయినా శ్రీశైలం నీటి ముంపు నిరుద్యోగు ల రెండవ జాబితాలో ఉన్న 674 మందికి ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అయినా రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు సంవత్సరం పూర్తి అయినప్పటికీ జీవో 98 నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది వారు విమర్శించారు. ఎందరో నిరుద్యోగులు ఉద్యోగాలకై ఎదురుచూస్తూ మనోవేదనకు గురై పదుల సంఖ్యలో మరణించడంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మరికొందరు ఉద్యోగ వయసు మించిపోయిందని నిరాశకు గురవుతున్నారు, ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి బాధితులకు ఉద్యోగాలు కల్పించి వారిని ఆదుకోవాలని వారు కోరారు. లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శ్రీశైలం నీటి ముంపు నిరుద్యోగులతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో, శ్రీశైలం నీటి ముంపు నిరుద్యోగుల సంఘం నాయకులు, నారాయణరెడ్డి, నాగ శేష సేనా రెడ్డి ,దర్గయ్య, మక్బూల్ ,వెంకటేష్ ,ఎల్ల స్వామి ,బాలకృష్ణ ,కృష్ణా రామారావు ,నారాయణ, విగ్నేష్ ,తదితరులు పాల్గొన్నారు.

# రంగరాజు చెరువులో

# మట్టి తవ్వుకో.. సొమ్ము చేసుకో.!

## రెచ్చిపోతున్న మట్టి మాఫియా.

-జెసిబి లతో రాత్రి, పగలు టిప్పర్లతో అక్రమ తవ్వకాలు మట్టి తరలింపు.

-రోజుకు 120 నుండి 150 వరకు టిప్పర్లతో మట్టి తరలింపు.

-పట్టించుకోని అధికారులు...ప్రభుత్వ ఖజానాకు గండి.

-లక్షలు సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు.

-చెరువులో మట్టి లోతు తొవ్వడం వల్ల, పొలాలకు నీరు బయటికి రావడం కష్టమని రైతులు ఆవేదన.

-వీఆర్వో ,ఎమ్మార్వో లకు ఫోన్ చేసినా ఎత్తడం లేదని రైతుల ఆవేదన.

-రాజకీయాలకు సంబంధం లేదని కొందరు, రాజకీయ అండదండలతో అని మరికొందరు.



ఆంధ్ర ప్రగతి శిరివెళ్ల మే 26:
కూటమి ప్రభుత్వం వచ్చిన మరుసటి రోజు నుండి ఎక్కడ చూసినా ఇసుక, గ్రావెల్ కనబడిన జేబులు నింపుకుంటున్నారని ప్రజల ఆవేదన చెందుతున్నారు. బోయలకుంట్ల రంగరాజు చెరువులో అక్రమ గ్రావెల్ తవ్వకాలు ఏదేచ్ఛగా జరుగుతున్నప్పటికీ ఇరిగేషన్, రెవెన్యూ ,పంచాయతీ, పోలీసు అధికారులు పట్టి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని రైతుల నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెరువులో కొన్ని రోజుల నుండి భారీగా టిప్పర్ల ద్వారా గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతున్న అధికారులు మాత్రం ఆ ఛాయాలకు కూడా రావడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇరిగేషన్, మైనింగ్ అధికారులు ఏం చేస్తున్నారని రైతులు గుసగుసలాడుకుంటున్నారు. ఏ ఒక్క అధికారి కూడా వారిని అడ్డుకునే దాఖలు లేవమంటున్నారు. రాత్రి, పగలు టిప్పర్లతో తరలిస్తుండడంతో ప్రతిరోజు 100 నుండి 120 వరకు గ్రావెల్ తవ్వకొని ఇష్టానుసారంగా ఇటుకల బట్టీలకు, అమ్ముకుంటున్నారు. ఒక టిప్పర్ కు మట్టి పదివేల నుండి 12 వేల వరకు దాకా అమ్ముకుంటున్నారంటే అర్థం చేసుకోవచ్చు. ఈ విషయమై స్థానిక ఎమ్మార్వో, వీఆర్వోలకు వివరణ కోసం వారికి ఫోన్లు చేయగా ఎత్తడం లేదని, రైతుల గోదుచెరువులో మట్టి లోతు తోవ్వడం వల్ల పొలాలకు తూములు , వాగులు, వంకలుదాటి నీరు రావడం కష్టమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మట్టి తవ్వకాలకు రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదని కొందరు అనగా, మరికొందరు రాజకీయ అండదండలతోనే ఈ వ్యవహారం నడుస్తుందని రైతులు చర్చించుకుంటున్నారు.

# పూర్తిస్థాయి డిజిపిగా హరీష్ గుప్తా



అమరావతి,మే26 ఆంధ్ర ప్రగతి: ఆంధ్రప్రదేశ్ పూర్తిస్థాయి రాష్ట్ర డీజీపీగా హరీష్ కుమార్ గుప్తాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయడు నియమించారు. రెండు సంవత్సరాల పాటు– డీజీపీగా హరీష్ కుమార్ గుప్తా కొనసాగనున్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ప్యానెల్ నుంచి హరీష్ కుమార్ గుప్తా పేరును సీఎం చంద్రబాబు ఎంపిక చేశారు. ఇప్పటివరకు ఏపీ ఇన్‌చార్జి డీజీపీగా హరీష్ కుమార్ గుప్తా ఉన్న విషయం తెలిసిందే. ఈమేరకు ఏపీ పూర్తిస్థాయి డీజీపీగా హరీష్‌కుమార్ గుప్తా కొనసాగనున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హరీశ్‌కుమార్ గుప్తా 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. జమ్మూకశ్మీర్‌కు చెందిన ఆయన.. ఖమ్మం ఏఎస్పీగా తన తొలి పోస్టింగ్ పొందారు. మెదక్, పెద్దపల్లిలలో ఏఎస్పీగా సేవలందించారు. కృష్ణా, నల్గొండ జిల్లాల ఎస్పీగా, హైదరాబాద్ సౌత్‌జోన్ డీసీపీగా కీలక బాధ్యతలు నిర్వహించారు. గుంటూరు రేంజి ఐజీగా, శాంతిభద్రతల విభాగం, ప్రొవిజన్స్ అండ్ లాజిస్టిక్స్ విభాగం అదనపు డీజీపీగా పనిచేశారు. పోలీసు నియామక మండలి ఛైర్మన్‌గా, రైల్వే డీజీగా విధులు నిర్వహించారు. 2022 మే నుంచి హోంశాఖ ముఖ్య కార్యదర్శిగా సేవలందించారు. జనవరి 31న అప్పటి డీజీపీ ద్వారకా తిరుమలరావు పదవీ విరమణ చేయడంతో.. ఇన్‌ఛార్జి డీజీపీగా హరీశ్‌కుమార్ గుప్తాను ప్రభుత్వం నియమించింది. తాజాగా పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించింది.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక





# చివరి దశకు ధోనీ కెరీర్

సూపర్ కింగ్స్ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని రిటైర్మెంట్ వార్త మరోసారి హాట్ టాపిక్ అవుతోంది. రవిశాస్త్రి అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. ప్రతి సంవత్సరం మైదానంలోకి తిరిగి దిగడం ఒక సవాలుగా మారిందన్నాడు ధోనీ. అతడి సారథ్యంలో చెన్నై జట్టు 5 ఐపీఎల్ ట్రోఫీలు సాధించింది. చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ మధ్య %IPL% 2025లో 66వ మ్యాచ్ జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో టాస్ కోసం కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కెప్టెన్ ధోని కూడా వచ్చారు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ధోని ఫస్ట్ బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకున్నారు. ధోని టాస్ సమయంలో పిచ్, వాతావరణం గురించి మాట్లాడిన తర్వాత తన జట్టు గురించి వివరించాడు. సీజన్‌తో ముగిసినట్లేనా అని అడిగిన ప్రశ్నకు ధోనీ బదులిస్తూ.. తన శరీరం ఇంకా సహకరిస్తోందని, కానీ ప్రతి సంవత్సరం తిరిగి రావడానికి ఒక కొత్త సవాలు ఎదురవుతుంది. బాడీ మెయింటెనెన్స్ చాలా అవసరం. కెరీర్ చివరి దశలో ఉన్నానని నాకు తెలుసు. ఈ సమయంలో ఏ ఆటగాడికైనా ఇలాగే ఉంటుంది. జాతీయ జట్టుకు ప్రాతినిథ్యం వహించాను, 18 ఏళ్లు ఐపీఎల్ ఆడాను. అయతే శరీరం సహకరించేందుకు తన ఫిట్ నెస్ గురించి చూసుకున్న వారికి ధన్యవాదాలు తెలిపాడు. ఈ సీజన్‌లో మొదట రుతురాజ్ గైక్వాడ్ చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్‌గా ఉన్నాడు. రుతురాజ్ గాయంతో ఐపీఎల్ సీజన్ మధ్యలోనే వైదొలగడంతో ధోనీ చేతికి సీఎస్కే పగ్గాలు వచ్చాయి. వచ్చే సీజన్‌లో రుతురాజ్ మళ్ళీ కెప్టెన్‌గా కనిపించవచ్చు. ధోనీ వచ్చే సీజన్ ఆడినా కెప్టెన్ గా మాత్రం అతడు ఉండడు. రుతురాజ్ లేక మరో ప్లేయర్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. అందుకే సీఎస్కే కెప్టెన్‌గా ధోనీ చివరి మ్యాచ్ ఆడేశాడని భావించవచ్చు.ఎంఎస్ ధోని వచ్చే ఐపీఎల్ సీజన్‌లో ఆడతాడా లేదా అనే దాని గురించి ఇంకా ఎటువంటి ప్రకటన చేయలేదు. తన శరీరం సహకరిస్తే వచ్చే సీజన్లో మళ్లీ మైదానంలో కనిపిస్తా అని ఇటీవల చెప్పాడు. మరో సీజన్ అంటే 8 నెలలు టైం ఉంటుందని, అప్పటికీ శరీరం సహకరిస్తే సీఎస్కే మేనేజ్‌మెంట్‌కు తన పరిస్థితి తెలియజేస్తానని

# కోహ్లీ, రోహిత్ ల అరుదైన లిస్టులో అభిషేక్ శర్మ



సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ ఓపెనర్ అభిషేక్ శర్మ ఐపీఎల్ 2025 సీజన్‌లో మరో గౌరవనీయమైన మైలురాయిని చేరుకున్నారు. మే 25న అరుణ్ జైట్లీ స్టేడియంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో ఆయన ఐపీఎల్‌లో తన 100వ సిక్సర్‌ను బాది, లీగ్ చరిత్రలో ఈ ఘనతను సాధించిన అరుదైన ఆటగాళ్ల జాబితాలో చేరిపోయాడు. మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న %ూ=ు% జట్టు, ట్రావిస్ హెడ్ తో కలిసి అభిషేక్ శర్మ 92 పరుగుల అద్భుతమైన తొలి వికెట్ భాగస్వామ్యాన్ని నెలకొల్పడంతో, జట్టు మంచి ఆరంభాన్ని పొందింది. అభిషేక్ 16 బంతుల్లో 32 పరుగులు చేయగా, ఇందులో నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి. ఈ సిక్సర్లలు రెండు సునీల్ నరైన్ బౌలింగ్‌పై వచ్చింది, ఇవి అతనికి వ్యక్తిగతంగా 100వ సిక్సర్లగా నిలిచాయి. 75వ ఐపీఎల్ ఇన్నింగ్స్‌లోనే ఈ మైలురాయిని అధిగమించిన అభిషేక్, ఇప్పుడు ఐపీఎల్ చరిత్రలో 100 సిక్సర్లు బాదిన ఆటగాళ్లలో 41వ ఆటగాడిగా నిలిచాడు. ఈ జాబితాలో ఇప్పటికే విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి దిగ్గజులు ఉన్నారు. అంతేకాకుండా, అభిషేక్ ఆ జాబితాలో చోటు సంపాదించడం యువ ఆటగాళ్లకు స్ఫూర్తిదాయకం. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు అత్యధిక సిక్సర్లు బాదిన ఆటగాడు క్రిస్ గేల్ కాగా, అతని పేరిట మొత్తం 357 సిక్సర్లు ఉన్నాయి. రోహిత్ శర్మ 297 సిక్సర్లతో రెండో స్థానంలో ఉన్నారు, త్వరలోనే 300 సిక్సర్ల మైలురాయిని అధిగమించే అవకాశం ఉంది. ఇలాంటి ఘనతలు అభిషేక్ శర్మ క్రికెట్‌లో చేస్తున్న అభివృద్ధిని సూచిస్తాయి. వయసులో చిన్నవాడైనప్పటికీ, అతని ఆటతీరులో కనిపిస్తున్న ఆత్మవిశ్వాసం, దూకుడు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఓపెనర్‌గా నిలదొక్కుకున్న అభిషేక్, వరుసగా చక్కటి ప్రదర్శనలతో జట్టును విజయపథంలో నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. మైదానంలో అతని బ్యాటింగ్ దూకుడు మాత్రమే కాదు, సాధించిన రికార్డులు కూడా తను భారత క్రికెట్ భవిష్యత్తు కోసం ఎంత ఖచ్చితమైన ఆటగాడో నిరూపిస్తున్నాయి. ఐపీఎల్ 2025 సీజన్‌ను హై తో ముగించిన సన్‌రైజర్స్ హైదరాబాద్, ఆదివారం ఢిల్లీలో అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది. ఫిరోజ్ షా కోట్లా మైదానంలో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన ఈ ఉత్కంఠభరిత మ్యాచ్‌లో, హెన్రిచ్ క్లాసెన్ విజృంభించడంతో 110 పరుగుల భారీ తేడాతో గెలిచింది. క్లాసెన్ కేవలం 37 బంతుల్లోనే సెంచరీ సాధించి, తన సునాయాసమైన శైలిలో 105 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అతనికి తోడుగా ఓపెనర్ ట్రావిస్ హెడ్ కూడా అద్భుతంగా ఆడి 40 బంతుల్లో 76 పరుగులు చేసి 'ఆరెంజ్ ఆర్మీ'కి శక్తివంతమైన ఆరంభాన్ని ఇచ్చాడు. ఈ జోడి ప్రదర్శనతో 20 ఓవర్లలో కేవలం 3 వికెట్లు కోల్పోయి 278 పరుగుల భారీ స్కోరు చేయగలిగింది. ఇది మొదటి మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై చేసిన 286 పరుగుల తర్వాత రెండో అత్యధిక స్కోరుగా నిలిచింది. హెన్రిచ్ క్లాసెన్ విధ్వంసం, ట్రావిస్ హెడ్ స్థిరత గెలుపుకు మూలస్థంభాలుగా నిలిచాయి.

# 2025లో అద్భుతమైన ఫామ్‌లో రోహిత్ శర్మ



ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ ఐపీఎల్ 2025లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటివరకు ఆడిన 12 మ్యాచ్‌ల్లో రోహిత్ శర్మ 150 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో 305 పరుగులు చేశాడు. ఇందులో మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఈ సీజన్‌లో ముంబై తరఫున అత్యధిక పరుగులు చేసిన మూడో ఆటగాడిగా రోహిత్ శర్మ నిలిచాడు. రోహిత్ కంటే ముందు ర్యాన్ రికెల్టన్(361), సూర్యకుమార్ యాదవ్(583) మాత్రమే ఉన్నారు.పంజాబ్ కింగ్స్ జట్టుతో జరగబోయే మ్యాచ్‌లో రోహిత్ శర్మ రెండు భారీ రికార్డులపై కన్నేశాడు. ఆ మ్యాచ్‌లో రోహిత్ శర్మ మరో 67 పరుగులు చేస్తే ఐపీఎల్‌లో 7000 పరుగుల మార్కును చేరుకుంటాడు. రోహిత్ ఆ ఘనతను సాధించిన రెండో బ్యాటర్ అవుతాడు. ఐపీఎల్‌లో విరాట్ కోహ్లీ మాత్రమే ఈ అరుదైన ఘనతను సాధించాడు. విరాట్ కోహ్లీ ఖాతాలో 8552 పరుగులు ఉండగా.. రోహిత్ శర్మ ఖాతాలో 6933 పరుగులు ఉన్నాయి. విరాట్, రోహిత్ తర్వాత క్యాష్ రీచ్ లీగ్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్లుగా శిఖర్ ధావన్(6769), డేవిడ్ వార్నర్(6565), సురేష్ రైనా(5528) ఉన్నారు. ఈ చారిత్రాత్మక విజయానికి చేరువలో ఉన్న రోహిత్ శర్మ ఐపీఎల్ 2025 ప్లేఆఫ్ మ్యాచ్‌లలో కూడా ఈ రికార్డును సాధించే అవకాశం ఉంది. ఎందుకంటే ముంబై ఇండియన్స్ ఇప్పటికే ప్లేఆఫ్స్‌లో తన స్థానాన్ని నిర్ధారించుకుంది. ఇది కాకుండా, రోహిత్ శర్మ ఐపీఎల్‌లో 300 సిక్సర్లు కొట్టిన రెండో ఆటగాడిగా నిలిచేందుకు కేవలం 3 సిక్సర్ల దూరంలో ఉన్నాడు. హిట్‌మ్యాన్ తన ఐపీఎల్ కెరీర్‌లో 297 సిక్సర్లు కొట్టాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సిక్సర్లు కొట్టిన రికార్డు క్రిస్ గేల్ పేరిట ఉంది, అతను 357 సిక్సర్లు కొట్టాడు.

# జట్టులోకి తిరిగి రావడం గర్వంగా ఉంది

## కరుణ్ నాయర్



ఎనిమిది సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టులోకి తిరిగి వచ్చిన కరుణ్ నాయర్ తన మనసులోని భావాలను బహిర్గతం చేశాడు. 2017లో చివరిసారి టెస్ట్ మ్యాచ్ ఆడిన తర్వాత జట్టులో స్థానం కోల్పోయిన నాయర్, ఇప్పుడు 2024-25 దేశవాళీ సీజన్‌లో అద్భుత ప్రదర్శనతో భారత జట్టులోకి తిరిగి వచ్చాడు. దేశవాళీ క్రికెట్‌లో అత్యుత్తమ ఫామ్‌ను చూపించిన నాయర్, రంజీ ట్రోఫీలో తొమ్మిది మ్యాచ్‌ల్లో నాలుగు శతకాలు సహా 863 పరుగులు, విజయ్ హజారే ట్రోఫీలో ఎనిమిది ఇన్నింగ్స్‌లలో ఐదు శతకాలు సహా 779 పరుగులు చేసి తన అర్హతను నిరూపించాడు. ఈ ప్రదర్శనలే అతని మళ్లీ జాతీయ జట్టులోకి రావడానికి మార్గం సుగమం చేశాయి. ఢిల్లీ క్యాపిటల్స్ తరపున ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్‌పై ఆరు వికెట్ల విజయంలో కీలకంగా 27 బంతుల్లో 44 పరుగులు చేసి జట్టును గెలుపు దిశగా నడిపిన నాయర్, మ్యాచ్ అనంతరం తన హర్షాతిరేకాన్ని వ్యక్తం చేశాడు. "తిరిగి రావడం గర్వంగా ఉంది. చాలా సందేశాలు వచ్చాయి, చాలా ఆనందంగా ఉంది. ఈ పిలుపు కోసం నేను ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నాను. గత 12-16 నెలలుగా బాగా బ్యాటింగ్ చేస్తున్నాను. అదే ప్రక్రియను కొనసాగించాను. నేను చేస్తున్న పనులే చేస్తూ కొనసాగాను" అని అతను చెప్పాడు. విదర్భ తరపున రంజీ ట్రోఫీ గెలుపులో నాయర్ కీలక పాత్ర పోషించాడు. అతని బలమైన ప్రదర్శనకు ఫలితంగా, భారత జట్టులో తిరిగి స్థానం సంపాదించాడు. ఇంతకాలం తన ఫామ్‌ను నిరూపించేందుకు, తిరిగి పిలుపు కోసం ఎదురు చూసిన నాయర్ ఇప్పుడు తన ఆటతీరుతో మళ్లీ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. అంతేకాదు, ఢిల్లీ క్యాపిటల్స్ ప్లే-ఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయినా, చివరి మ్యాచ్‌లో గెలిచినందుకు నాయర్ ఆనందం వ్యక్తం చేశాడు. "మేము మంచి టీం, కానీ ఈ సీజన్‌లో మా అత్యుత్తమ ఆట తేలలేదు. అయినా ఈ రాత్రి గెలుపుతో మేము మంచి జట్టు అని నిరూపించుకున్నాం" అని నాయర్ అన్నారు. ఈ మ్యాచ్‌లో యువ ఆటగాడు సమీర్ రిజ్వీ తన తొలి ఐపీఎల్ అర్ధ సెంచరీతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నప్పటికీ, మిడిల్ ఓవర్లలో కరుణ్ నాయర్ ఇచ్చిన మద్దతు జట్టుకు ఎంతో కీలకంగా మారింది. "టోర్నమెంట్‌లోకి నేను చాలా పరుగులతో వచ్చాను. ఆత్మవిశ్వాసంతో బంతిని బాగా హిట్ చేస్తున్నాను. కొచ్‌లు నా వద్ద ఎక్కువ సమయం కేటాయించారు, పెద్ద షాట్లు ఆడమని ప్రోత్సహించారు. దాంతో నేను దూకుడుగా షాట్లు ఆడగలగుతున్నాను" అని నాయర్ అన్నాడు.

# క్వాలిఫయర్-1కు పంజాబ్

## అదరగొట్టిన ఆర్య, ఇంగ్లిస్ -7 వికెట్లతో ముంబై చిత్తు

జైపూర్: ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్.. ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో టాప్-2 బెర్త్‌ను ఖరారుచేసుకొంది. జోష్ ఇంగ్లిస్ (42 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లతో 73), ప్రియాన్ష్ ఆర్య (35 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62) అర్ధ శతకాలతో అదరగొట్టడంతో..సోమవారం జరిగిన కీలక మ్యాచ్‌లో పంజాబ్ 7 వికెట్లతో ముంబై ఇండియన్స్‌ను ఓడించింది. తొలుత ముంబై 20 ఓవర్లలో 184/7 స్కోరు చేసింది. సూర్యకుమార్ (39 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 57) హాఫ్ సెంచరీ చేయగా.. రికెల్టన్ (27), హార్దిక్ (26), రోహిత్(24) ఫర్వాలేదనిపించారు. అర్ష్‌దీప్, జాన్సెన్, వైశాక్ తలో 2 వికెట్లు తీశారు. ఛేదనలో పంజాబ్ 18.3 ఓవర్లలో 187/3 స్కోరు చేసి గెలిచింది. శ్రేయాస్ (26 నాటౌట్) రాణించాడు. శాంట్నర్‌కు 2 వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఇంగ్లిస్ నిలిచాడు.

**సునాయాసంగా..:** ఛేదనలో ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (13) స్వల్ప స్కోరుకే వెనుదిరిగినా.. ఆర్య, ఇంగ్లిస్ రెండో వికెట్‌కు 109 పరుగుల భాగస్వామ్యంతో జట్టును గెలుపు బాటలో నిలిపారు. ముంబై పేసర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పవర్‌ప్లేలో పంజాబ్ 47/1తో నిలిచింది. వీరిద్దరూ 12వ ఓవర్‌లో అర్ధ శతకాలు పూర్తి చేసుకొన్నారు.



అయితే, 15వ ఓవర్‌లో ఆర్యను అవుట్ చేసిన శాంట్నర్.. వీరి భాగస్వామ్యాన్ని విడదీశాడు. చివరి 5 ఓవర్లలో పంజాబ్ విజయానికి 39 పరుగులు కావల్సి ఉండగా.. ఇంగ్లిస్, శ్రేయాస్ అయ్యర్ 28 పరుగుల భాగస్వామ్యంతో వేగంగా ముగించే ప్రయత్నం చేశారు. 15 బంతుల్లో 14 పరుగులు అవసరపడగా.. ఇంగ్లిసను శాంట్నర్ ఎల్బీ చేశాడు. కానీ, రెండు సిక్స్‌లు బాదిన అయ్యర్.. మరో 9 బంతులు మిగిలుండగానే జట్టును గెలిపించాడు.

**ఆదుకొన్న సూర్య:** సూర్యకుమార్ అర్ధ శతకంతో ఆదుకోవడంతో.. ముంబై పోరాడగలిగే స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి ఓపెనర్లు రికెల్టన్, రోహిత్ శర్మ తొలి వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యంతో నిలకడైన ఆరంభాన్నిచ్చారు. ఆరో ఓవర్‌లో రికెల్టన్‌ను జాన్సెన్ క్యాచవుట్ చేశాడు. 9వ ఓవర్‌లో జేమిసన్ బౌలింగ్‌లో సూర్య 6,4,4 బాదినా.. ఆ తర్వాతి ఓవర్‌లో బ్రార్ బౌలింగ్‌లో వధేరా అద్భుత క్యాచ్‌తో రోహిత్ వెనుదిరిగాడు. దీంతో రెండో వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తిలక్ వర్మ (1), విల్ జాక్స్ (17) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఈ దశలో హార్దిక్ పాండ్యా కొంత ఊపుతెచ్చాడు. డకౌటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకొన్న పాండ్యా.. ఆ తర్వాత స్కోరువేగం పెంచే ప్రయత్నం చేశాడు. కానీ, 17వ ఓవర్‌లో జాన్సెన్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన హార్దిక్.. ఆ తర్వాతి బంతికే వెనుదిరిగాడు. చివరి మూడు ఓవర్లలో సూర్య, నమన్(20) ఆరో వికెట్‌కు వేగంగా 31 పరుగులు జోడించడంతో.. ముంబై స్కోరు 180 దాటింది. 19వ ఓవర్‌లో వైశాక్ బౌలింగ్‌లో నమన్ రెండు సిక్స్‌లు, సూర్య రెండు బౌండ్రీలు సాధించడంతో మొత్తం 23 రన్స్ లభించాయి. ఆఖరి ఓవర్‌లో నమన్, సూర్యను అర్ష్‌దీప్ అవుట్ చేశాడు



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక





# సవాళ్ల మధ్య కళావతి ప్రయాణం!

కీర్తి సురేష్ అలియాస్ కళావతి జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. అమ్మడు ఇప్పుడు తెలుగు, హిందీ, తమిళ్ అంటూ మూడు భాషల్లోనూ సినిమాలు చేస్తోంది. అదనంగా బాలీవుడ్ లో వెబ్ సిరీస్ ల్లో కూడా నటిస్తోంది. కెరీర్ ఆరంభంలో విధించుకున్న నియమ నిబంధలను పక్కనబెట్టి పని చేస్తోంది. గ్లామర్ కం రొమాంటిక్ పాత్రలకు సైతం సై అంటోంది. ఇండస్ట్రీ తన నుంచి ఏ కోరుకుంటుందో వంద శాతం అదే ఇవ్వడానికి తన వంతు ప్రయత్నం చేస్తోంది.వివాహం తర్వాత ఎన్నో మార్పులు చేసింది. భర్త నుంచి అన్నిరకాలుగా మద్దతు లభిస్తోంది. దీంతో కీర్తి కెరీర్ లో మరింతగా ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి అన్ని రకాలు ప్రయత్నాలు చేస్తోంది. రేయింబవళ్లు షూటింగ్ ల్లో పాల్గొంటుంది. హైదరాబాద్ టూ ముంబై, చెన్నై అంటూ పరుగులు తీస్తోంది. అవసరమైతే రెండు షిఫ్టులు పనిచేస్తోంది. తాజాగా ఈ ప్రయాణాన్ని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది.ఒకేసారి మూడు భాషల్లో పనిచేయడం అన్నది ఎంతో సవాల్ తో కూడుకున్న పనిగా పేర్కొంది. అయినా నచ్చిన పనని మనస్ఫూర్తిగా స్వీకరించి పని చేస్తున్నట్లు తెలిపింది. ఇలా పనిచేయడం వల్ల నటనా ఫరిదిని విస్తరించినట్లు అవుతుందంది. కెరీర్ లో సవాళ్లు తనకు కొత్త కాదని...ఆరంభంలోనే ఎన్నో ఛాలెంజిగ్ రోల్స్ పోషించినట్లు గుర్తు చేసుకుంది.ఇప్పటికే టాలీవుడ్...కోలీవుడ్ లో ఫేమస్ అయిన నేపథ్యంలో బాలీవుడ్ సినిమాలపై మరింత ఏకాగ్రతతో పని చేస్తోంది. కొత్త అవకాశాలు వెతికి పట్టుకుంటుంది. %-%అక్క%-% అనే వెబ్ సిరీస్ లో నటిస్తోంది. ఇందులో బోల్డ్ బ్యూటీ రాధికా ఆప్టేతో పోటీ పడి మరీ నటిస్తోంది. హిందీలో ఇటీవలే మరో చిత్రానికి ఒకే చెప్పింది. తమిళ్ లో %-%రివాల్వర్ రీటా%-% లో నటిస్తోంది. తెలుగులో మరో రెండు కొత్త చిత్రాలకు గ్రీన్ సిగ్నెల్ ఇచ్చింది.

## 15 మంది ఏఐ క్యారెక్టర్లతో “లవ్ యూ” సినిమా



ఏఐ సాంకేతికతతో నటీనటులు, క్యారెక్టర్ ఆర్టిస్టులు లేకుండానే సినిమా చిత్రీకరణ పూర్తి చేసి విడుదల చేయడం జరిగింది. హీరో హీరోయిన్లే కాకుండా ఇతర ఆర్టిస్టులు, మొత్తం 15 మంది ఏఐ క్యారెక్టర్లతో ఒక పూర్తి సినిమా ఇటీవల విడుదలైంది.“లవ్ యూ” పేరుతో కన్నడ భాషలో విడుదలైన ఈ సినిమా ప్రపంచంలోనే తొలి ఏఐ చిత్రంగా రికార్డు సృష్టించింది. ఏఐ సాంకేతికతతో అద్భుతం సృష్టించవచ్చని నిరూపించారు.ఈ సినిమా కోసం లేని నటులను సృష్టించడమే కాకుండా, ఒక అద్భుత మాయాలోకాన్ని ప్రేక్షకుల ముందు ఉంచింది ఏఐ. ఈ చిత్రంలో కనిపించే ఊళ్లు, కార్లు, రైళ్లు, చెట్లు చేమలు అన్నీ కల్పితమే. ఇది అంతా కృత్రిమ మేథస్సు చేసిన ఇంద్రజాలమే.సినిమాలో ఒక్క షాట్ కూడా కెమెరాతో చిత్రీకరించలేదు. తెర ముందు ఇలా మాయా ప్రపంచాన్ని సృష్టించడమే కాకుండా, తెర వెనుక ఈ చిత్రానికి నేపథ్య సంగీతాన్ని, పాటలకు బాణీలను అందించింది కూడా కృత్రిమ మేథనే.అయితే సినిమా చూసి హీరో హీరోయిన్లపై అభిమానం పెంచుకునే ప్రేక్షకులకు, ఏఐ నటీనటులను చూడటం అంత ఉత్సాహాన్ని కలిగించకపోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

## పవన్ కళ్యాణ్ సినిమాలు ఆపే దమ్ము ఎవరికీ లేదు

### మీడియా సమావేశంలో నిర్మాత దిల్ రాజ్



పవన్ కళ్యాణ్ సినిమాలు నడవకుండా ఆపే దమ్ము ఎవరికీ లేదని, థియేటర్ల మేసివేత జరగదని నిర్మాత దిల్‌రాజ్ స్పష్టం చేశారు.రెంట్,పర్సెంట్ గొడలవలతో అనవసరంగా థియేటర్ల మూత అంశం ప్రచారం జరిగిందన్నారు. థియేటర్ల వివాదం అంశం మీద అనేక చర్చలు జరుగుతున్న క్రమంలో నిన్న అల్లు అరవింద్ తర్వాత సోమవారం దిల్ రాజు మీడియా ముందుకు వచ్చారు. నిర్మాతలందరం ఎగ్జిబిటర్ల సమస్యలపై చర్చించాం. ’హరిహర వీరమల్లు’ విషయంలో తప్పుగా వెళ్లింది. పవన్‌కల్యాణ్ సినిమాలను ఆపే దమ్ము, ధైర్యం ఎవరికీ లేదు. మంత్రి దుర్గేష్కాకు ఫోన్ చేస్తే థియేటర్లు మూసివేయరని స్పష్టంగా చెప్పా. తప్పుడుగా సమాచారం వచ్చిందని ఆయనకు వివరించా. జూన్ నెలంతా పెద్ద సినిమాలున్నాయి. ఈ సమయంలో సినీ పరిశ్రమను ఎలా కాపాడుకోవాలనేదే అందరి తపన అని అన్నారు. జూన్, జులై, ఆగస్టు సినిమాలకు కీలక సీజన్. ఈస్ట్ గోదావరిలో ఓ వ్యక్తితో మొదలైన సమస్య తెలంగాణకు ఆపాదించారు. సినిమా వాళ్లకు రెండూ ప్రభుత్వాలు చాలా ముఖ్యం. సినీ పరిశ్రమకు, ప్రభుత్వానికి మధ్యలో అనుసంధానంగా ఉండాలనే సీఎం రేవంత్‌రెడ్డి నన్ను ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా పెట్టారు. కళ్యాణ్‌గారు చెప్పాక పక్కంటికి వెళ్లినంత సులభంగా వెళ్లి పేపర్ పట్టుకొని టికెట్ ధరలు పెంచుకొని వస్తున్నారు. అందరం కలిసి ఐక్యంగా ఉండాలనే ఆలోచన మా దగ్గర తక్కువ. ఉత్తరాంధ్రలో మాకు డిస్ట్రిబ్యూషన్ ఆఫీసు ఉంది, అక్కడ 20 థియేటర్లు ఉన్నాయి. రెండు ప్రభుత్వాలు సినీ పరిశ్రమకు అండగానే ఉన్నాయి. ఛాంబర్‌లోనే కొట్టుకుంటారు. ఐక్యత లేదు. ఈ ఎపిసోడ్‌తో ఇప్పటికైనా తెర దించుదాం అని దిల్‌రాజు అన్నారు. ఇకపోతే అసలు ఈ వివాదం ఎక్కడ మొదలైంది అనే విషయం మీద ఆయన క్లారిటీ ఇచ్చారు. అయితే డిస్ట్రిబ్యూటర్లు ఆ విషయాన్ని ఒప్పుకోలేదు. అదే విషయం మా హైదరాబాదులో ఉన్న నిర్మాతల దృష్టికి వచ్చింది. ఏప్రిల్ 26వ తేదీన నిర్మాతల గిల్డ్ మీటింగ్ జరిగింది. ఆ మీటింగ్ సమయానికి ఒకవేళ జూన్ 1వ తేదీకి వారు కోరుకున్న విధంగా పర్సంటేజీ విధానంలో సినిమాలు ఆడించకపోతే సినిమా థియేటర్లో ఆపాలమే నిర్ణయం తీసుకున్నట్లు మా దృష్టికి తీసుకువచ్చారు. ఇది ఎగ్జిబిటర్లు డిస్ట్రిబ్యూటర్లు మధ్య ఈస్ట్ గోదావరి జిల్లాలో జరిగిన సంఘటన.. అది మా గిల్డ్ దృష్టికి వచ్చినప్పుడు గిల్డ్ లో ఉన్న నిర్మాతలు అందరూ అసలు వాళ్ళకి ఎందుకు వర్కౌట్ కావడం లేదు అని ఆలోచించి, ఒక ఆరు నెలలు వారికి అవుతున్న ఖర్చు ఏమిటి వారికి వస్తున్న ఆదాయం ఏమిటి అనే విషయాలు బేరీజు వేసి వారికి ఎందుకు వర్కౌట్ అవడం లేదు అనేది పరిశీలించడం కోసం వారిని స్టేట్‌మెంట్స్ తీసుకురావాలని అడుగుదామనుకున్నాం. వచ్చినప్పుడు డిస్కషన్ లో పెట్టి నిజంగా ఎగ్జిబిటర్లకు సమస్య ఉందా లేదా అనేది పరిశీలించాలి అనుకున్నాం. నిజానికి నేను డిస్ట్రిబ్యూటర్ గా దాదాపు అన్ని ఏరియాలో కవర్ చేస్తున్నాను. ఎగ్జిబిటర్ల కష్టాలు కూడా మాకు తెలుసు. మేము నిర్మాతలుగా లేదా డిస్ట్రిబ్యూటర్లుగా బాగా డబ్బులు వస్తుంటే మొదటి వారం రెంట్ ఇస్తున్నాం రెండోవారం పర్సంటేజీ విధానం ఇస్తున్నాం. ఇది వాళ్లకు నిజంగా ఇబ్బందికరమైన విషయమే. దానికి సొల్యూషన్ మేము చాలా రోజుల నుంచి అనుకుంటు-న్నాం కానీ ఉన్న పరిస్థితుల కారణంగా నిర్మాతలు కూడా హ్యాపీగా లేరు. కాబట్టి ఆ సొల్యూషన్ రావడం లేదు. అని ఆయన అన్నారు.

## కన్నప్పలో ప్రభాస్ పాత్ర అమోఘం

### ప్రమోషన్ కార్యక్రమంలో మంచు విష్ణు



కన్నప్ప ప్రమోషన్లు జోరుగా సాగుతున్నాయి. జూన్ 27న వస్తున్న ఈ సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభాస్, కాజల్, అక్షయ్ కుమార్, మోమన్ లాల్ కీలక పాత్రల్లో చేస్తున్న సంగతి తెలిసిందే కదా. అయితే ప్రభాస్ పాత్ర గురించి పెద్ద చర్చ జరుగుతోంది. ఇప్పటికే ప్రభాస్ పాత్ర గురించి మంచు విష్ణు రకరకాల కామెంట్లు- చేస్తూ వస్తున్నాడు. తాజాగా ప్రభాస్ పాత్ర కన్నప్పలో ఎంత టైమ్ ఉంటుందో చెప్పి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశాడు. ఈ సినిమాలో ప్రభాస్ ను అతిథి పాత్ర కోసం తీసుకోవాలని ముందుగా అనుకున్నాం. కానీ తర్వాత 30 నిముషాల వరకు ప్రభాస్ పాత్రను పెంచేశాం. చివరి 50 నిముషాలు ప్రభాస్ ను ప్రేక్షకులు చూసి ఎంజాయ్ చేస్తారు. నాకు తెలిసి ఈ పాత్ర ప్రభాస్ లైఫ్ లో ది బెస్ట్ అవుతుందని నేను అనుకుంటు-న్నాను. పాత్ర అద్భుతంగా వచ్చింది. ప్రభాస్ హైట్, ఫేస్ కట్ అవన్నీ దృష్టిలో పెట్టు-కుని డిజైన్ చేశాం. ప్రభాస్ కు మా నాన్న మోహన్ బాబుకు మధ్య వచ్చే సీన్లు అద్భుతంగా ఉంటాయి. ఇందులో మోహన్‌లాల్ పాత్ర 15 నిమిషాలు, అక్షయ్ కుమార్ 10 నిమిషాలు కనిపిస్తారు. సినిమా మొత్తం3 గంటల 10 నిమిషాలు ఉంటుంది. ప్రభాస్ పాత్ర మూవీపై మంచి ఇంపాక్ట్ చూపిస్తుంది’ అంటూ చెప్పారు విష్ణు.

## నటుడు కాకపోతే ధనుష్ మంచి చెఫ్!



**సెలబ్రిటీ హొదా...కోట్లాది మంది అభిమానం అందుకోవాలన్నా రాసి పెట్టి ఉండాలి. అది కొందరికి మాత్ర మే సాధ్యమవుతుంది. అనుకోకుండా ఇండస్ట్రీకి వచ్చి స్టార్లు అయిన వాళ్లు ఉన్నారు. స్టార్ అవ్వాలని పరిశ్రమకి వచ్చి తిరిగెళ్లిపోయిన వాళ్లు ఉన్నారు. సక్సెస్ అన్నది కొందరికే. పరిశ్రమకొచ్చి సక్సెస్ అయితే అలాంటి వారందరినీ కారణజన్ములనే చెప్పాలి. కోట్ల రూపాయల సంపాదన...ఖరీదైన జీవితం... స్టేటస్.. అభిమా నం సాధ్యమయ్యేది కేవలం సినిమా ఇండస్ట్రీలో మాత్రమే.అందులోనూ తెలుగు, తమిళ ఇండస్ట్రీలో స్టార్ అయ్యాడంటే ఆ క్రేజ్ వేరుగా ఉంటుంది. ఈ నేపథ్యంలో కోలీవుడ్ నటుడు ధనుష్ ముందుకు ఓ ఆసక్తికర ప్రశ్న వెళ్లింది. నటుడు అయ్యారు కాబట్టి ఈ స్టేటస్ వచ్చింది. ఒకవేళ నటుడు కాకపోతే మీ జీవితం ఎలా ఉండేదని ప్రశ్నించగా.. మరో ఆలోచన లేకుండా మంచి చెఫ్ గా స్టార్ హొటల్ లో ఉద్యోగం చేసేవాడినన్నారు. చిన్న తనం నుంచి వంట అంటే ఇష్టమట.వంటల్లో ప్రయోగాలు చేయడం అంటే చెప్పలేనంత ఇష్టమన్నాడు. చిన్నప్పుడు వంటింట్లో అమ్మ పక్కనే ఉండి వంట చేయడం అలవాటు అయిందన్నాడు. వంట విషయంలో తల్లికి మంచి సహాయకుడిగా ఉండేవాడుట. అలా వంట పనిలో బాగా నలిగినట్లు తెలిపాడు. అన్ని రకాల వంటలు చేయడం వచ్చు అట. ఇప్పుడు కూడా అప్పుడప్పుడు ప్రయోగాలు చేసి డాడ్ కి రూచి చూపిస్తానన్నాడు.ఒకవేళ ధనుష్ చెఫ్ అయితే చిత్ర పరిశ్రమ గొప్ప నటుడిని కోల్పోయేది. బిర్యానీ చేయడంలో యంగ్ టైగర్ ఎన్టీఆర్ కూడా మాస్టర్. దోశెలు వేడయంలో రామ్ చరణ్ స్పెషలిస్ట్. రుచికరమైన నాన్ వెజ్ వంటకాలు తయారు చేయించడంలో ప్రభాస్ స్పెషలిస్ట్ అన్న సంగతి తెలిసిందే**

## అంజలి టాలెంట్‌ను గుర్తించని టాలీవుడ్

హీరోయిన్ అంజలి గురించి పరిచయం అక్కర్లేదు. తెలుగు అమ్మయి అయినప్పటికి తమిళంలో స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది. టాలీవుడ్‌లో మాత్రం ఎప్పుడూ ఛాన్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి. వెంకీ, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, రామ్ చరణ్ వంటి స్టార్ హీరోలు జతకట్టిన.. అవకాశాలు మాత్రం దక్కడం లేదు. ఆమె మంచి నటిగా గుర్తింపు పొందినా పెద్దగా పట్టించుకోవడం లేదు. ప్రజెంట్ ఆమె చేతిలో ఒక్కటంటే ఒక్క తెలుగు సినిమా కూడా లేదు. గీతాంజలి మళ్లీ వచ్చింది, గేమ్స్ ఆఫ్ గోదావరి, గేమ్ ఛేంజర్ లాంటి వరుస ప్లాపులు ఆమెకు ఛాన్సులు లేకుండా చేస్తున్నాయి. గ్లామర్ షో చేస్తూ టాలెంట్ ఉన్నప్పటికి.. టాలీవుడ్ దర్శకులు ఆమెను కన్సిడర్ చేయడం లేదు. కానీ..తెలుగు ఇండస్ట్రీ కాదంటున్నా.. తమిళ చిత్ర పరిశ్రమ అంజలికి ఎప్పుడూ ఛాన్సులు ఇస్తూనే ఉంది. రీసెంట్‌గా ’మదగజరాజా’తో బ్లాక్ బస్టర్ అందుకున్న ఈ తెలుగమ్మాయి.. ప్రస్తుతం కోలీవుడ్‌లో రెండు సినిమాలు చేస్తోంది. ’ఈగై’ తో పాటు- ’పరందు పో’ అనే మూవీ చేస్తోంది. పరాయి ఇండస్ట్రీ హీరోయిన్స్ ని కోట్లు పెట్టి తీసుకుంటారు.. కానీ తెలుగు టాలెంటెడ్ యాక్టర్స్ ను మాత్రం గుర్తించరు అనే అపవాదు ఎప్పటి నుంచో ఉంది. ఇక అంజలి

